Vist us @ www.sooryasena.com

RNI.No.: TELTEL/2023/85598

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool

శనివారం SATURDAY || 23.05.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 248 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah




## పల్లె ప్రగతిలో

# బ్యాంకుల పాత్ర కీలకం

### తెలంగాణలో గ్రామాల అభివృద్ధికి బ్యాంకులు భాగస్వాములు కావాలి: మంత్రి తుమ్మల



**హైదరాబాద్, మే, 22 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి రుణాల పంపిణీని భారీగా పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని, ఈ అవకాశాన్ని బ్యాంకులు ఉపయోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. 'తెలంగాణలో క్రెడిట్-డిపాజిట్ (జణ) నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదు కావడం గొప్ప విశేషం. ప్రస్తుతం రాష్ట్రంలో బ్యాంక్ డిపాజిట్లు రూ. 9.43 లక్షల కోట్లుగా ఉంటే, అడ్వాన్సులు (రుణాలు) రూ. 12.33 లక్షల కోట్లకు చేరాయి. వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించింది. నిర్ణీత లక్ష్యం కంటే ఎక్కువగా 102 శాతం ప్రగతిని నమోదు చేయడం హర్షణీయం. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ. 75,486 కోట్లకు చేరిందని, వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ. 1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందజేశాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడింది.

## 'కాక్రోచ్ జనతా పార్టీ' ఖాతా ఇండియాలో నిలిపివేత..

### సోషల్ మీడియాలో చర్చకు దారితీసిన నిర్ణయం



**ఢిల్లీ, మే, 22 (సూర్యసేన ప్రతినిధి):** ఇటీవల సోషల్ మీడియాలో సంచలనంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఉద్యమం ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచింది. రాజకీయ వ్యంగ్య ధోరణితో యువతలో వేగంగా ప్రాచుర్యం పొందిన ఈ డిజిటల్ ఉద్యమానికి చెందిన ఖాతాను భారతదేశంలో నిలిపివేసినట్లు ఎక్స్ సంస్థ ప్రకటించింది. చట్టపరమైన అభ్యర్థనల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఉద్యమ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే తన వ్యక్తిగత ఖాతా ద్వారా వెల్లడించారు. అకౌంట్ నిలిపివేసిన విషయానికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను షేర్ చేస్తూ, "మేము ముందుగానే ఊహించినట్లుగానే కాక్రోచ్ జనతా పార్టీ ఖాతాను భారతదేశంలో బ్లాక్ చేశారు" అని పేర్కొన్నారు. ఈ పరిణామం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. పలువురు ప్రముఖులు దీనిపై స్పందిస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాద స్పందిస్తూ, "భారతదేశంలో ఈ ఖాతాను ఎందుకు నిలిపివేశారు?" అంటూ ప్రశ్నించారు. ఇక స్టాండప్ కమెడియన్ వీర్ దాస్ తనదైన శైలిలో స్పందిస్తూ దీనిని "స్ట్రైసాండ్ ఎఫెక్ట్"గా అభివర్ణించారు. ఏదైనా విషయాన్ని దాచడానికి లేదా పరిమితం చేయడానికి చేసిన ప్రయత్నం దానిని మరింత ఎక్కువగా ప్రజల్లోకి తీసుకెళ్లే పరిస్థితిని సైకాలజీలో స్ట్రైసాండ్ ఎఫెక్ట్గా పిలుస్తారు. మరోవైపు సీనియర్ నటుడు ప్రకాశ్ రాజ్ కూడా ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. యువత తమ అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తపరచడం సమాజానికి అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

అలాగే కొత్తగా ప్రారంభించిన బ్యాకప్ ఖాతాకు సంబంధించిన పోస్టును కూడా ఆయన పంచుకున్నారు. నటి సనం శెట్టి కూడా ఈ ఉద్యమంపై స్పందించారు. తక్కువ సమయంలోనే యువతలో ఈ స్థాయి ఆదరణ పొందడం విశేషమని, ఈ ఉద్యమం ఏ దిశగా ముందుకు సాగుతుందో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. అసలు కాక్రోచ్ జనతా పార్టీ అంటే ఏమిటి అనే అంశం కూడా ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ ఉద్యమాన్ని మే 16న పొలిటికల్ స్ట్రాటజిస్ట్ అభిజీత్ దిప్కే ప్రారంభించారు. ఇటీవల యువతపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో నిరసనగా ఈ వ్యంగ్యాత్మక డిజిటల్ ఉద్యమం రూపుదిద్దుకుంది. యువత తమ అసంతృప్తిని శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తపరచడానికి దీనిని వేదికగా ఉపయోగిస్తున్నారు. ఇది అధికారిక రాజకీయ పార్టీ కాకపోయినప్పటికీ, ఒక ప్రత్యేక మేనిఫెస్టోను కూడా విడుదల చేసింది. ప్రారంభమైన కొద్ది రోజులకే ఈ ఉద్యమానికి సోషల్ మీడియాలో భారీ ఆదరణ లభించింది.

## రూ.5,600 కోట్ల స్కామ్..


# హీరా గ్రూప్ ఎండీ నౌహీరా షేక్ అరెస్ట్

**హీరా గ్రూప్ ఎండీ నౌహీరా షేక్‌ను అరెస్ట్ చేసిన ఈడీ**

**రూ.5,600 కోట్ల పెట్టుబడుల మోసం కేసులో ప్రధాన నిందితురాలు**

**నకిలీ ఆధార్‌తో గుర్గావ్‌లో అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తింపు**

**విచారణ కోసం హైదరాబాద్‌కు తరలించనున్న అధికారులు**



**ఢిల్లీ, మే, 22 (సూర్యసేన ప్రతినిధి):** భారీ పెట్టుబడుల మోసం కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) నౌహీరా షేక్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారు. రూ. 5,600 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె, గత కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్నారు. నకిలీ ఆధార్ కార్డుతో గుర్గావ్‌లో నివసిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఈడీ అధికారులు, ఆమెను అక్కడే అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం నౌహీరాను హైదరాబాద్‌కు తరలించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. హీరా గ్రూప్ సంస్థ ద్వారా ప్రజల నుంచి నౌహీరా షేక్ రూ. 5,600 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పెట్టుబడులపై ఏకంగా 36 శాతం వార్షిక వడ్డీ చెల్లిస్తామంటూ భారీ ఎత్తున ప్రచారం చేసి ప్రజలను ఆకర్షించారు. అయితే, హామీ ఇచ్చిన ప్రకారం వడ్డీ చెల్లించకపోగా, అసలు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పెద్ద సంఖ్యలో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలోనే తాజాగా అజ్ఞాతంలో ఉన్న నౌహీరా షేక్‌ను అరెస్ట్ చేయడం ఈ కేసులో కీలక పరిణామంగా భావిస్తున్నారు.

## భారత్ ఎన్నటికీ

# తలవంచదు: అమిత్‌షా



**న్యూఢిల్లీ మే, 22 (సూర్యసేన ప్రతినిధి):** సరిహద్దు చొరబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. ఇందుకోసం జీరో టాలరెన్స్ పాలసీని అనుసరించనున్నామనీ, దేశ సరిహద్దులను మూసివేసేందుకు ఏడాదిలోగా సమగ్ర 'స్మార్ట్ బోర్డర్' పాలసీని తీసుకురానున్నామని చెప్పారు. అక్రమ వలసదారులను వెనక్కి తిప్పిపంపుతామని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారంనాడు జరిగిన సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) సిబ్బంది సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ, అక్రమ వలసలను కృత్రిమంగా దేశ జనాభాలో మార్పు తెచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్రగా అభివర్ణించారు. దేశ డెమోగ్రాఫిక్స్‌ను సురక్షితంగా ఉంచేందుకు అక్రమ వలసదారులను ప్రభుత్వం గుర్తించి ప్రతి ఒక్కరిని వెనక్కి పంపిస్తుందని స్పష్టం చేశారు. ఇందుకోసం దేశంలోని 6,000 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అభేద్యమైన భద్రతా గ్రిడ్‌ను అమలు చేస్తుందని చెప్పారు. స్మార్ట్ బోర్టర్ కాన్సెప్ట్ కింద రాడార్లు, అడ్వాన్స్‌డ్ కెమెరాలతో బీఎస్ఎఫ్‌ను అధునాతన టెక్నాలజీతో సన్నద్ధం చేస్తామని వివరించారు. బీఎస్ఎఫ్ నేరుగా రాష్ట్ర పోలీసులు, జిల్లా కలెక్టర్లు, విలేజ్ పట్వారీల సమన్వయంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవాలని, అక్రమ చొరబాటుదారులను, పశువుల అక్రమ రవాణా మార్గాలను గురించాలని అమిత్‌షా సూచించారు.

# మలేషియాలో 6న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

### ముఖ్య అతిథిగా హాజరు కానున్న కెటిఆర్

### బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి




**హైదరాబాద్, మే, 22 (సూర్యసేన ప్రతినిధి):** మలేషియా తెలంగాణ అసోసియేషన్, బీఆర్ఎస్ మలేషియా సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6 న కౌలాలంపూర్‌లో జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ రామారావు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను మాజీ మంత్రి ,ఎమ్మెల్యే జి .జగదీశ్ రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా కేసీఆర్ పేరును గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ లేని లోటు రెండున్నర ఏండ్లుగా కనిపిస్తుందని వెల్లడించారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేక పోతుందని, కేసీఆర్ ఇచ్చిన పథకాలనూ ఇవ్వలేక పోతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయామని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. అమెరికా దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో గతంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డల్లాస్‌లో జరిగాయని వివరించారు. దేశంలో బీజేపీ పాలనలో చిన్న పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలపై అఘాయిత్యాలు చేస్తున్న నిందితులను పట్టుకునే శక్తి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ త్వరంలో ప్రారంభమవుతుందని, రైతులకు విత్తనాలు ,ఎరువులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు.

రేవంత్ రెడ్డి పాత గురువు, చీకటి గురువు చెప్పినట్లు రైతులను వ్యవసాయానికి దూరం చేస్తున్నారని మండిపడ్డారు .రైతాంగాన్ని ముంచి వ్యవసాయ సబ్సిడీలు దోచుకోవాలనే ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని అన్నారు.ప్రపంచ వ్యాప్తంగా ఏం జరిగిన ట్వీట్ చేసే రాహుల్ గాంధీ తెలంగాణలో మైనర్ బాలిక ఘటన పై ఎందుకు ట్వీట్ చేయ లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణ ప్రజలకు , మహిళలకు శ్రీరామ రక్ష అని అన్నారు . ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ ప్రెసిడెంట్ మహేష్ బిగాల, మైటా ప్రెసిడెంట్ తిరుపతి,ఉమెన్స్ వింగ్ సుప్రియ, బీఆర్ఎస్ మలేసియా ప్రెసిడెంట్ చిట్టీ బాబు, శివ, రాష్ట్ర నాయకులు నరసింహ రెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, ధర్మేందర్ రెడ్డి, పడాల సతీష్, రవి యాదవ్ పాల్గొన్నారు.


## ఆప్-ఆర్జేడీ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న మాజీ సైనికులు..

# అసత్యాలు ప్రచారం చేస్తున్నారు: ఆర్మీ




**న్యూఢిల్లీ మే, 22 (సూర్యసేన ప్రతినిధి):** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ఆర్జేడీ సంయుక్త ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న యూనిఫామ్‌లో కనిపించిన వ్యక్తులు మాజీ సైనికులని ఆర్మీ తెలిపింది. సర్వీస్ నుంచి తొలగించిన ఆ వ్యక్తులు ఆర్మీ గురించి అసత్యాలు, అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో నలుగురు మాజీ సైనికులు పాల్గొన్నారు. సర్వీస్ నుంచి తమను తొలగించడంపై పలు ఆరోపణలు చేశారు. కాగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ ప్రెస్‌మీట్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలపై ఆర్మీ స్పందించింది. శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది. 'వీడియోలో కనిపించిన చందు చవాన్, హరేంద్ర యాదవ్, పీ నరేందర్‌లను క్రమశిక్షణారాహిత్యం, సైనికోచిత ప్రవర్తన కారణంగా సర్వీస్ నుంచి తొలగించినట్లు పునరుద్ఘాటిస్తున్నాం. నాల్గవ వ్యక్తి శంకర్ సింగ్ గుజ్జర్ 2024 నవంబర్ నుంచి పలాయనం చేసిన సైనికుడు. అతడిపై సైనిక, సివిల్ కోర్టులలో క్రమశిక్షణా చర్యలు కొనసాగుతున్నాయి' అని ఆర్మీ తెలిపింది. సైన్యంగురించి అబద్ధాలు చెబుతున్నారని, అధికారులు-సైనికుల మధ్య విభేదాలు సృష్టించి రెచ్చగొట్టడం ద్వారా ఆర్మీలో చీలికలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. తద్వారా సైన్యం ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంది. అలాగే తమ దుష్ప్రవర్తన, సర్వీస్ నుంచి తొలగింపుపై ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఆ నలుగురు మాజీ సైనికులు ఉద్దేశపూర్వకంగా 'నకిలీ, దురుద్దేశపూరిత, తప్పుదోవ పట్టించే కథనాలను' సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారని ఆర్మీ ఆరోపించింది.

## దేవాలయాలపై ప్రభుత్వాల నియంత్రణ చట్టాలు.. విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్



**న్యూఢిల్లీ మే, 22 (సూర్యసేన ప్రతినిధి):** తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరిలో హిందూ దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ చట్టాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టును ఆశ్రయించాలంటూ ఏప్రిల్ 2025న ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు వెనక్కి తీసుకుంది. దేవాలయాలపై ప్రభుత్వాల నియంత్రణ చట్టాలపై విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దక్షిణ భారతదేశంలోని హిందూ దేవాలయాలను ప్రభుత్వాలు తమ అధీనంలో ఉంచుకోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన కీలక పిటిషన్ల విచారణకు సుప్రీంకోర్టు శుక్రవారంనాడు అంగీకరించింది. కేసును హైకోర్టులకు బదిలీ చేస్తూ గతంలో ఇచ్చిన పాత ఆదేశాలను జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీశ్ శర్మతో కూడిన ధర్మాసనం రద్దు చేసింది.

# జిల్లా స్థాయి సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన జిల్లా పోలీస్ స్టాల్








**– పోలీస్ స్టాల్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్, జిల్లా ఎస్పి నరసింహ**

**సూర్యాపేట టౌన్, మే 22 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా యంత్రాంగం అధ్వర్యంలో పట్టనలోని రవి మహల్ ఫంక్షన్ హాల్ నందు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 వేల కార్యాచరణలో భాగంగా ఆయా శాఖలు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ప్రగతి అంశాల గురించి స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ఉద్యమం,
మహిళా భద్రతా, పిల్లల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ మోసాల నివారణ ప్రదర్శన అంశాలపై స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనను జిల్లా కలక్టర్ తేజస్ నంద లాల్ పవార్, జిల్లా ఎస్పి నరసింహ గార్లు జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. సైబర్ మోసాల నివారణ అవగాహన పోస్టర్, మహిళా భద్రత, రోడ్డు భద్రత పోస్టర్లను అవిష్కరించారు. పోలీస్ శాఖ చేపట్టిన అంశాల గురించి ఎస్పి గారు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నిర్మూలన ప్రజలను మరింత చైతన్యవంతం చేయాలని తెలిపినారు. ప్రస్తుతం సమాజంలో పిల్లలను, యువతను, ప్రజలను, విద్యార్థులను గంజాయి లాంటి మాదక ద్రవ్యాలను మన సమాజం నుండి కూకటి వేళ్ళతో వెలివేయాల్సిన బాధ్యత అందరిపై ఉన్నది అన్నారు. ప్రజలకు అత్యాశ చూపి ప్రజలను ఆర్థికంగా దోచుకుంటున్నారని ఇలాంటి వారి పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు ఎవరైనా సైబర్ వోసానికి గురైనట్లు గుర్తించినట్లయితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్స్ కు ఫిర్యాదు చేయాలని కలెక్టర్, ఎస్పి అన్నారు. మహిళలు పిల్లల భద్రతలో భరోసా సెంటర్, షీ టీమ్స్, మానవ అక్రమ రవాణా నిరోధక టీం పటిష్టంగా పనిచేయాలని సూచించారు.

# వృద్ధులను టార్గెట్ చేస్తున్న, అంతర్ జిల్లా చైన్ స్నాచింగ్ దొంగల ముఠా అరెస్ట్







**– నిందితులు నుండి సుమారు 22 లక్షల,75 గ్రాముల బంగారం, ఒక కారు, రెండు సెల్ ఫోన్లు రికవరీ**
**– జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్**

నల్గొండ, మే 22 (సూర్య సేన): నేషనల్ హైవే పోలీస్ స్టేషన్ల పరిధిలో వృద్ధులు, మహిళలను లక్ష్యంగా చేసుకొని వరుస రాబరీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నేరగాళ్ల గ్యాంగ్‌ను నల్గొండ జిల్లా సీసీఎస్ పోలీసులు మరియు కట్టంగూర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి సుమారు రూ. 22 లక్షల విలువైన 75 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక హ్యుందాయ్ వెర్నా కారు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టయిన నిందితుల వివరాలు

1) (ఏ-1) పాకాల ధర్మ తేజ తండ్రి: గిరిరావు,వయస్సు: 35 సంవత్సరాలు,వృత్తి: లేబర్,నివాసం: చిన్న బీరెల్లి,గ్రామం, బోనకల్ మండలం, ఖమ్మం జిల్లా.

2) (ఏ-2) షేక్ చాంద్ పాషా తండ్రి: మస్తాన్ వలి,వయస్సు: 28 సంవత్సరాలు వృత్తి: కారు డ్రైవర్ నివాసం:రావినూతల గ్రామం, బోనకల్ మండలం, ఖమ్మం జిల్లా. (తేదీ 16-05-2026న కట్టంగూర్ పోలీస్ స్టేషన్లో అరెస్ట్ చేయబడినాడు)

3) (ఏ-3) సయ్యద్ రంజాన్ వలి,తండ్రి: అబ్దుల్ రెహమాన్,వయస్సు: 27 సంవత్సరాలు,వృత్తి: చికెన్ షాప్,నివాసం: ఎల్‌బి సెంటర్, నందిగామ టౌన్, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**కేసు వివరాలు**

తేదీ 10-03-2026 రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో కట్టంగూర్ మండలానికి చెందిన అయితగొని సునీల్ తన స్నేహితుడితో కలిసి ముత్యాలమ్మగూడెం గ్రామ శివారులోని టిఫిన్ సెంటర్ వద్ద భోజనం చేసి తిరిగి బుల్లెట్ బైక్‌పై వస్తుండగా, కట్టంగూర్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన బైక్ ఆపి నిలుచున్నారు.ఈ సమయంలో కారులో వచ్చిన ముగ్గురు దుండగులు వారిపై దాడి చేసి, చంపుతామని బెదిరించి, సునీల్ మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ను బలవంతంగా లాక్కొని పరారయ్యారు.ఈ ఘటనపై బాధితుడు తేదీ 15-05-2026న కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై రవీందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయబడ్డాయి. దర్యాప్తులో భాగంగా తేదీ 16-05-2026న నల్గొండ ఎక్స్ రోడ్డు, కట్టంగూరులో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఏ-2 షేక్ చాంద్ పాషా పట్టుబడగా, నేరానికి ఉపయోగించిన ఏూ08-ఖీశ-1231 నంబర్ గల హ్యుందాయ్ వెర్నా కారు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఇక పరారీలో ఉన్నఏూ-1 పాకాల ధర్మ తేజ మరియుఏూ-3 సయ్యద్ రంజాన్ వలీ కోసం పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గాలింపు చేపట్టారు. శుక్రవారం తెల్లవారు జామున 6 గంటల సమయంలో విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనాలను తనిఖీ చేస్తుండగా, లారీలో ప్రయాణిస్తున్న ఇద్దరు నిందితులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు.

**నిందితుల మోడ్ ఆఫ్ ఆపరేషన్ (మీా)**

నిందితులు ప్రధానంగా సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 9 గంటల మధ్య హైవే వెంట ఒంటరిగా వెళ్తున్న వృద్ధులు, మహిళలు మరియు బస్ సౌకర్యం లేని ప్రాంతాల్లో నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులను టార్గెట్ చేసేవారు. వారిని బెదిరించి, కొట్టి బంగారు ఆభరణాలు దోచుకునే విధంగా నేరాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితులు జల్సాలకు అలవాటు పడి గత ఐదు సంవత్సరాలుగా ఖమ్మం, కోదాడ, సూర్యాపేట, చౌటుప్పల్ ప్రాంతాల్లో డకైటీలు, రాబరీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ మొత్తం 18 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, వేసవికాలంలో గ్రామాల్లో నేరస్తుల సంచారం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు రాత్రి వేళల్లో ఒంటరిగా ఖరీదైన బంగారు ఆభరణాలు ధరించి బయటకు వెళ్లవద్దని, డాబాలపై ఆభరణాలతో నిద్రించవద్దని తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఇలాంటి నేరాలను త్వరితగతిన ఛేదించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన సీసీఎస్ సీఐ జితేందర్ రెడ్డి, సీఐ డి. చంద్రశేఖర్ రెడ్డి, శాలిగౌరారం ఇన్‌చార్జ్ సీఐ రాఘవరావు, కట్టంగూర్ ఎస్సై ఎం. రవీందర్, ఎస్సై డి. విజయ్ కుమార్, సీసీఎస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధనగిరి, నాగార్జున ప్రసాద్, పుష్పగిరి, వహీద్ పాషా, కానిస్టేబుళ్లు సాయి, శివరాజ్, జూనైద్, నరేశ్, నాగరాణి, అలాగే కట్టంగూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది రామ్మోహన్, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ ఎండి. ముజీబ్ తదితరులను జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# బసవరాజు శ్రీనివాస్ తో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పరుగులు పెట్టాలి

**– బ్రాహ్మణ సంఘం నాయకులు జాలీగామ వి ఎల్ నరసింహారావు**



**రంగారెడ్డి, మే 22 (సూర్య సేన) :** ఇటీవల అధికారికంగా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన బసవరాజు శ్రీనివాసుని ప్రముఖ బ్రాహ్మణ సంఘం నాయకులు జాలీగామా వి ఎల్ నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిసి వారికి ఘన సన్మానం చేశారు.

ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, బసవరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అభివృద్ధి పథంలో పురోగమించాలని ప్రతి పేద బ్రాహ్మణుడికి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఫలాలు అందాలని ఆకాంక్షించారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ నేతృత్వంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పరుగులు పెట్టాలని ఆకాంక్షించారు.

# పంట పొలాల్లో వరి కొయ్యలను, పంట వ్యర్థాలను కాల్చవద్దు.....




**– పంట పొలాల్లో నిప్పు పెడితే భూమిలో ఉన్న సూక్ష్మజీవులు, పోషకాలు నశిస్తాయి**
**– భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గుతుంది**
**– పరిసరాల్లో ఉన్న విద్యుత్ మోటార్ల సామాగ్రి, గడ్డివాములు, ఇతర పంటలు కాలిపోయి రైతుకు ఆర్థిక నష్టం ఏర్పడుతుంది**
**– రైతులు భూసారాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవాలి**
**– జిల్లా ఎస్పీ నర్సింహ ఐపీఎస్.**

**సూర్యాపేట క్రైమ్, మే 22 (సూర్య సేన) :** వరి కొయ్యలకు, పంట వ్యర్థాలకు నిప్పంటించడం వల్ల పరిసరాలు తగలబడి అందులో విద్యుత్ మోటార్లు, స్టారర్ లు, కరెంట్ తీగలు, గడ్డివాములు, ఇతర పంటలు కాలిపోయి రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుంది, దీని వల్ల భూమిలో ఉన్న పోషకాలు, క్రిమి కీటకాలు, సూక్ష్మజీవులు, భూసారం పెంచే వానపాములు మంటల్లో కాలిపోయి భూసారం తగ్గుతుందని తద్వారా పంటల దిగుబడి తగ్గుతుందని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. వరి కొయ్యలు కాల్చే క్రమంలో చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ మోటర్లు ఇతర సామాగ్రి గడ్డివాములు ఇతర పంటలు కాలిపోతున్న సంఘటనలు జిల్లాలో అక్కడక్కడ నమోదు అవుతున్నాయి అన్నారు.

ఎండ తీవ్రత వడగాలి తీవ్రత ఎక్కువగా ఉన్నది మంటలు వేగంగా చాలా ఎకరాల్లో వేగంగా వ్యాప్తి చెందుతాయి, ఇలా వ్యాప్తి చెందే మంటలు గ్రామాలను తాకే అవకాశం ఉన్నది అన్నారు. కావున పంట భూముల్లో పంట వ్యర్థాలు, వరి కొయ్యలు ఎవ్వరూ కాల్చవద్దని ఎస్పీ కోరారు. రైతులు భూసారాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవాలి. మంటల వల్ల భూసారం తగ్గి ఎక్కువ ఎరువులు వేయాల్సి వస్తుంది, రైతుకు ఖర్చు పెరుగుతుంది.

గాలి కాలుష్యం అవుతుంది. దట్టమైన పోగకమ్మి రోడ్డుప్రమాదాలు జరుగుతాయి. కావున రైతులు పంట వ్యర్థాలను భూమిలో కలయదున్నాలి, ఇది కంపోస్ట్, సేంద్రియ ఎరువుగా ఉపయోగించుకోవాలి, పర్యావరణానికి అనుకూలమైన పద్ధతులు పాటించాలి. రైతు తమ ఆరోగ్యం, భూమి భవిష్యత్తు, పర్యావరణ రక్షణకోసం పంట వ్యర్థాలు కాల్చకుండా ఉండాలని కోరారు. వరి కోయ్యలు తగలబెడుతూ ఇతరులకు నష్టం కలిగిస్తే అలాంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

# మళ్లీ భారత రాష్ట్ర సమితి అధికారంలోకి రావడం ఖాయం

**– భారత రాష్ట్ర సమితి బడంగ్ పేట, మాజీ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి**


రంగారెడ్డి, మే 22 (సూర్య సేన): రాష్ట్ర ప్రభుత్వ పనితీరులో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని భారత రాష్ట్ర సమితి బడంగ్ పేట, మాజీ అధ్యక్షులు రామిడి రామిరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఆయన మా ప్రతినిధితో మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుండే భారత రాష్ట్ర సమితి వైపు ప్రజలు చూస్తున్నారని పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో 100% తిరిగి భారత రాష్ట్ర సమితి అధికారంలోకి వస్తుందని ఈ నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి మరింత బాధ్యతగా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు. నిరంతరం ప్రజాసేవలో ఉండే రామిడి రామిరెడ్డి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటారు అనడంలో అతిశయోక్తి లేదు. వారం రోజుల్లోనే పెట్రోల్ లీటర్ నాలుగు రూపాయల వరకు పెంచడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న నాటకంలో భాగమని నిత్యవసరాల రేట్లు పెరగడంతో సామాన్య నగటు జీవి బెంబేలెత్తిపోతున్నాడని, మళ్లీ సారు రావాలి కారు కావాలి అని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం పై కార్యకర్తల దృష్టి పెట్టాలని డిజిటల్ పద్ధతిలోనే పార్టీ సభ్యత్వం నమోదు చేయాలని ఆకాంక్షించారు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చేపట్టిన "సర్" ప్రక్రియ తో పాటు ఓటర్ లిస్టు సవరణ తదితర కార్యాచరణ మొత్తం డిజిటల్ ప్రక్రియలో జరుగుతుందని ఈ నేపథ్యంలో పార్టీ సభ్యత్వం కూడా డిజిటల్ పద్ధతిలో జరగాలని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రాష్ట్ర కమిటీ నుంచి సభ్యత్వం నవెూదు సమన్వయకర్తలను నియమించుకోవాలని కోరారు.



**– వికారాబాద్ రంగారెడ్డి జిల్లాలకు సభ్యత్వ నమోదు ఇన్చార్జిగా సబితా**

రంగారెడ్డి వికారాబాద్ భారత రాష్ట్ర సమితి సభ్యత్వ నమోదుకు రాష్ట్ర మాజీ మంత్రి ప్రస్తుత మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డిని నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. పనిలో నిబద్ధత పట్టుదల గాపనిచేసే తత్వం ఉన్న సబితా ఇంద్రారెడ్డిని నియమించడం అభినందనీయమని ఆయన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు తన కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశబోయిన వెంకట్ రాములు కన్నుమూత, పలువురి సంతాపం...



**రంగారెడ్డి, మే 22 (సూర్య సేన) :** ప్రముఖ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశ బోయిన వెంకట్ రాములు (75 ) వేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మురారి పల్లిలో తన కుమారుడి స్వగృహంలో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన నర్రా రాఘవరెడ్డి పై 1985లో శాసనసభ్యుడిగా పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు. అప్పటినుండి ఇప్పటివరకు కాంగ్రెసును అంటిపెట్టుకొని పార్టీకి అనేక సేవలు అందజేశారు, ఇది ఇలా ఉండగా దేశ బోయిన వెంకట్ రాములు భార్య దేశ బోయిన ( గోపగాని పార్వతమ్మ ) ఉమ్మడి నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం ఆమనగల్లు సర్పంచిగా పనిచేశారు. వెంకట రాములు కుమారుడు దేశబోయిన రవికుమార్ ప్రస్తుతం తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేస్తున్నారు. వారి కుటుంబం మొత్తం కాంగ్రెస్ పార్టీకి అంకితం అయ్యారు.

శుక్రవారం సాయంత్రం వేములపల్లి మండలం ఆమనగల్లు లో దేశబోయిన వెంకట్ రాములు అంత్యక్రియలు జరిగాయి ఈ కార్యక్రమానికి దేశబోయిన కుటుంబ సభ్యులతో పాటు గోపగాని కుటుంబ సభ్యులు, పలువురు రాజకీయ నాయకులు హాజరై తమ సంతాపం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రణాళికా సంఘం అధ్యక్షులు వనపర్తి మాజీ శాసనసభ్యులు జిల్లెల్ల చిన్నారెడ్డి దేశ బోయిన వెంకట్రాములకు అత్యంత సన్నిహితులు.

# క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక వికాసం



**– గరిడేపల్లి ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్**

**గరిడేపల్లి ప్రతినిధి, మే 22 (సూర్య సేన) :** క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందని గరిడేపల్లి ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్మల్ చెరువు గ్రామంలో క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడంలో ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే

ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి స్నేహపూర్వక వాతావరణాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం:
## కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్




**- మహిళా సంఘాల భవనాలకు వెంటనే నిధులు మంజూరు**
**- క్షేత్రస్థాయిలో రూ.10 లక్షలతో షెడ్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలి**
**- దివ్యాంగ పిల్లల కోసం 342 ప్రత్యేక పరికరాల పంపిణీ**

**సూర్యాపేట, మే 22 (సూర్య సేన) :** జిల్లా సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం క్షేత్రస్థాయి అధికారులు సమష్టి ఆలోచనలతో, కలిసికట్టుగా పని చేస్తూ జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి నివేదికపై నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం స్థానిక రవి మహల్ లో జిల్లా ఎస్పీ నరసింహ తో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా



అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వారికి తోడుగా ఉంటారని భరోసా ఇచ్చారు.

**మహిళా సంఘాల భవనాలకు ప్రాధాన్యత**

గ్రామాల్లో మహిళా సంఘాలకు స్వంత భవనాలు లేకపోతే, సంబంధిత ఎంపీడీఓ ద్వారా తగిన ప్రతిపాదనలు పంపించాలని, అలా వచ్చిన ప్రతిపాదనలకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 370కి పైగా భవనాల ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో ఇప్పటికే 200 మహిళా సంఘ భవనాలకు గ్రౌండింగ్ పూర్తి చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, క్షేత్రస్థాయిలో మహిళల సౌకర్యార్థం రూ.10 లక్షల వ్యయంతో షెడ్స్ నిర్మించుకునే అవకాశం ఉందని, వీటి కోసం కూడా త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు.



**ప్రత్యేక అవసరాల పిల్లలకు చేయూతది**

వ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని 50 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం రూపొందించిన 342 ప్రత్యేక పరికరాలను అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పరికరాలను ప్రత్యేకంగా 'అలింకో' కంపెనీ ద్వారా నాణ్యతా ప్రమాణాలతో తయారు చేయించినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి



తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ కోరారు. అనంతరం ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ మారకద్రవ్యాలను కూకటివేళ్లతో పెకలించాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో



మరింత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సమాజంలో యువతను, విద్యార్థులను పట్టిపీడిస్తున్న గంజాయి లాంటి మాదకద్రవ్యాలను కూకటివేళ్లతో పెకలించి వేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగాపనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకుని ఆర్థికంగా దోచుకుంటున్న సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. మహిళలు, పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసిన భరోసా సెంటర్లు, షీ టీమ్స్, మరియు మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు మరింత పటిష్ఠంగా పనిచేస్తూ బాధితులకు అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం ప్రజా పాలన ప్రగతి నివేదికలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ ఇతర ఉన్నతాధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సైబర్ మోసాల నివారణ, మహిళా భద్రత, రోడ్డు భద్రతకు సంబంధించిన ప్రత్యేక అవగాహన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. పోలీస్ శాఖ తరపున క్షేత్రస్థాయిలో చేపడుతున్న వివిధ సేవా, రక్షణ కార్యక్రమాలను ఎస్పీ
నరసింహ కలెక్టర్‌కు వివరించారు కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ మరణించిన ఇద్దరు ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామక ఆర్డర్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి హరిసింగ్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, డి ఆర్ డి ఓ పి డి సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, సిపిఓ కిషన్, డి ఎస్ సి డి ఓ దయానందరాణి, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి ఇతర జిల్లా అధికారులు, సర్పంచులు, డ్వాక్రా మహిళలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.






# “అమ్మా (అవ్వా) బాగున్నావా...!....”కొడుకా సల్లంగుండు..!

**- (సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్... ఉపాధి కూలీ అవ్వ మధ్యన జరిగిన మానవత్వం పరిమళించే సంభాషణ సంఘటనావళి)**



ముగ్గు బుట్ట లాంటి తల... ముడతలు తేలిన దేహం అంటూ రోడ్డు పక్కన దీనంగా పడి ఉన్న ఒక పండు ముదుసలి గురించి మహాకవి శ్రీశ్రీ తన మహాప్రస్థానం గ్రంథంలో ప్రస్తావించి అద్భుతంగా వర్ణించిన తీరుకు సరిగ్గా సరిపోయేట్లు అలాంటి ఒక బక్క పల్చని దేహం, జీవిత కష్టాలలో మునిగి తేలిన ముడతలు పడ్డ ముదుసలి అవ్వ, కలెక్టర్ మధ్యన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామ చెరువు వద్ద గురువారం ఉపాధి హామీ పనులు జరుగుతున్న సందర్భంగా ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. తన ఉద్యోగ



నిర్వహణలో భాగంగా సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం ఉదయం 6 గంటలకు బయలుదేరి సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అనంతరం మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామంలోని చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనుల తనిఖీ నిమిత్తం వెళ్లారు. కూలీలందరూ యధావిధిగా తమ పనులు తాము చేసుకుంటూ నిమగ్నమైన సందర్భంలో కలెక్టర్ ఒకసారిగా సర్ప్రైజ్ విజిట్ కు రావడంతో ఉపాధి హామీ కూలీలు అందరు కూడా కలెక్టర్ చుట్టూ గుమ్మి గూడారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో పనులు జరుగుతున్న తీరుతెన్నుల గురించి కలెక్టర్ ఆరా తీస్తున్నారు. అక్కడే నిలుచున్న సుమారు 70 సంవత్సరాల వృద్ధురాలు ఎలాంటి జంకు బొంకు లేకుండా ధైర్యంగా కలెక్టర్ ముందు వచ్చి రెండు చేతులు పట్టుకొని తాము పడుతున్న కష్టాల గురించి కన్నీటి పర్యంతమైంది. ఒక్కసారిగా జరిగిన ఈ హఠాత్ పరిణామానికి స్పందించిన కలెక్టర్ వెంటనే అవ్వ చేతులను తన చేతిలోకి తీసుకొని అవ్వ బాగున్నావా...అంటూ ఆప్యాయంగా పలకరించారు. అవ్వ చెప్పిన తన జీవిత కష్టాలన్నీ సావధానంగా విన్నారు. అమ్మా... మీరు పెద్దవారు, గొప్పవారు, మీరు మాలాంటి వయసులో చిన్న వాళ్లకు దీవెనలు, ఆశీస్సులు అందించాలి తప్ప చేతులు జోడించవద్దు అంటూ ఉద్బోధించారు. దాదాపు తన మనవలు, మనవరాళ్ల వయసు గల యంగ్ టర్క్ అయిన కలెక్టర్ వయసులో చాలా చిన్నవారైనప్పటికీ వయసుకు మించిన పరిణితిని ప్రదర్శిస్తూ అవ్వ..అమ్మ.. అంటూ ఆప్యాయతతో పలకరించి తాను ఒక జిల్లా స్థాయి అధికారి అన్న కొందరు అధికారులు భావించే అహంభావాన్ని పక్కనపెట్టి సమస్యల పట్ల స్పందించే హృదయంగా రియాక్ట్ అయ్యారు. తాను కలెక్టర్, అవ్వ కూలి అన్న భేదాభిప్రాయాలను ఏమాత్రం ప్రదర్శించకుండా బేషజాలన్నీ పక్కనపెట్టి చక్కగా మాట్లాడారు. తాను సాధారణ కూలి అయినప్పటికీ మానవత్వాన్ని, మనిషి తత్వాన్ని తట్టి లేపే లాగా కలెక్టర్ దగ్గరకు తీసుకోవడంతో అవ్వ కళ్ళలో కన్నీళ్లు సుడులు తిరిగాయి. కళ్ళు కన్నీళ్లతో చెమ్మగిల్లాయి. చుట్టూ అక్కడ ఒక గంభీర వాతావరణం నెలకొంది. చెట్టు మీద ఎక్కడో దూరంగా ఒక అనురాగాన్ని, ఆప్యాయతలను, అనుబంధాలను కల్పించేలాగా, వినిపించేలాగా ఉదయపు సంధ్యారాగం లాగా సుస్వరాల కోకిల గానం వినిపించింది. కలెక్టర్ ఎవరికీ కొడుకు అయినప్పటికీ, అవ్వ ఎవరికి తల్లి అయినప్పటికీ ఒక తల్లి కొడుకుల బాండింగ్ అక్కడ ఏర్పడింది. ఆ కూలి కన్న తల్లి చూపించిన ప్రేమానురాగాలు తన కన్నతల్లి పక్కన ఉండి పంచిన విధంగా కలెక్టర్ బావించి తన కన్నతల్లి తో గడిపిన మధుర క్షణాలను ఈ తల్లి ప్రేమలో చూసుకుని కొద్దిసేపు ఆలోచనా పూరిత మౌనసంద్రంలో మునిగిపోయారు. జీవితంలో అన్ని కష్టనష్టాలను చవిచూసిన ఆ కన్నతల్లి లో ఏ కన్నతల్లి పేగు బంధం కదలాడిందో కానీ తాము “కూటికి మాత్రమే పేదలము కానీ, ఆప్యాయత, అనురాగాల మానవత్వపు నిండుకుండలము” అన్నట్టుగా అవ్వ స్పందించడం, అందుకు తగ్గట్టుగా కలెక్టర్ కూడా కూలీలలో ఒక సగటు మనిషిగా కలిసిపోయి సాధారణ వ్యక్తిగా వారితో కొద్దిసేపు ముచ్చటించడం అక్కడ ఉన్న



వారిని, అప్పటి అక్కడి పరిస్థితులను ఉత్సాహంగా, ఉల్లాసంగా, సరదాగా, సంతోషంగా మార్చివేశాయి. “ పుట్టుకతో ఎవరు గొప్పవారు కాదు, అట్లా అనిఎవరు తక్కువ వారు కాదు, సమాజంలోని వివిధ వ్యవస్థలు ఏర్పరచిన అంతరాల దొంతరలే తప్పించి వాస్తవానికి అందరూ అలాంటి మహా తల్లికి కన్న బిడ్డలే..” జీవితం ముగిశాక అందరూ ఈ భూతల్లి ఒడిలో తారతమ్యాలు లేకుండా నిద్రపోయేవారే” అన్న జీవిత సత్యాన్ని తత్వాన్ని అలవర్చుకొని, అనుసరిస్తూ, ఆచరించే తత్వజీవి సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొందరు అనుకునే తారతమ్యాలను, భేదాభిప్రాయాలను ఏనాడు పాటించని వ్యక్తిగా కలెక్టర్ తమతో గడిపిన ఆ విలువైన జీవితపు క్షణాలను ఆ సగటు సాధారణ గ్రామీణ ప్రజానీకం సంపూర్ణ సంతోషంతో స్వాగతించి ఆస్వాదించారు.



**- రాష్ట్ర ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత,**
**గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ కృష్ణ బంటు**

# ఫ్యూచర్ సిటీపై హరీష్ రావు వ్యాఖ్యలు సరికాదు

**-జర్నలిస్టులకు ఇళ్ళస్థలాల కేటాయింపును అడ్డుకుంటారా?**
**-టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**



**హైదరాబాద్, మే 22 (సూర్య సేన) :** మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై మాజీ మంత్రి, బీఆర్ ఎస్ నేత హరీష్ రావు చేసిన వ్యాఖ్యలు సహేతుకమైనది కాదని, అభివృద్ధి విషయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు. రాబోయే ప్రభుత్వం బీఆర్ ఎస్ అనీ, తాము అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి హరీష్ రావు అనడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, హరీష్ రావు వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాన్ని తాము స్వాగతిస్తున్నామని, అయితే ఈ ప్రయత్నాన్ని అడ్డుకోవడం కోసమే హరీష్ రావు కుట్రపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులకు గత పదేళ్ళలో టీఆర్ ఎస్, బీఆర్ ఎస్ ప్రభుత్వం చేయలేని పని కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని మామిడి సోమయ్య అన్నారు. జర్నలిస్టులకు,సివిల్ సర్వీసెస్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫ్యూచర్ సిటీలో 500 ఎకరాల భూమి కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన ప్రస్తుత సమయంలో మాజీ మంత్రి హరీష్ రావు ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం పాత్రికేయుల్లో ఆవేదన,ఆందోళన వ్యక్తమవుతుందని ఆయన పేర్కొన్నారు. తమ రాజకీయ కక్షలు, స్వార్థ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష నేతలు ప్రజల అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడం సరైంది కాదని, జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించబోయే ఫ్యూచర్ సిటీకి అడ్డుపడడం బీఆర్ ఎస్ పార్టీ చేయబోయే పెద్ద తప్పిదమని అన్నారు. తొమ్మిదిన్నరేళ్ళు అధికారంలో ఉండి జర్నలిస్టులకు ఏమీ చేయని ప్రతిపక్ష బీఆర్ ఎస్ నాయకులు జర్నలిస్టుల సంక్షేమానికి అడ్డురావడం సరైంది కాదని అన్నారు.

# సుధా బ్యాంకులో గుడిపూడి కి ఘన సన్మానం...



**సూర్యాపేట కల్చరల్, మే 22 (సూర్య సేన) :** సుధా బ్యాంక్ ఆడిటోరియంలో లయన్స్ వైస్ డిస్టిక్ గవర్నర్ ఇటీవల ఎన్నికైన గుడిపూడి వెంకటేశ్వరరావు ను సుధా బ్యాంకు పాలకవర్గం ఘనంగా సన్మానించడం జరిగింది. 52 సంవత్సరాల సుదీర్ఘ సూర్యాపేట లయన్స్ క్లబ్ చరిత్రలో ఒక లయన్ సభ్యుడు 8 జిల్లాలలో ఉన్న లయన్స్ క్లబ్బుల సముదాయానికి గవర్నర్ గా ఎన్నిక కావడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా సుధా బ్యాంక్ ఎండి పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ గుడిపూడి వెంకటేశ్వరరావు ఎన్నిక కావడం సూర్యాపేట పట్టణంలో ఒక చారిత్రక సంఘటన.
చిరకాలం గుర్తుండిపోయే గొప్ప విషయం అని చెప్పారు. సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహాదేవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ లయ న్స్ క్లబ్ సభ్యులు పుర ప్రముఖులు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల తో పాటు సుధా బ్యాంక్ వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్, డైరెక్టర్లు ఏపూరి శ్రవణ్ కుమార్, అప్పం శ్రీనివాస్, పటేల్ నరసింహారెడ్డి ,తోట శ్యాం ప్రసాద్, మీలా సందీప్, పోనుగోటి నిర్మల, బోనగిరి భాస్కర్, రాచర్ల కమలాకర్ ,ఇరిగి కోటేశ్వరి, గుండా లక్ష్మయ్య,తన్నీరు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# 2030 నాటికి టీబీ రహిత భారత్ లక్ష్యం

**- హుజూర్‌నగర్‌లో క్షయ నిర్ధారణ శిబిరం**

**హుజూర్‌నగర్ ప్రతినిధి, మే 22 (సూర్య సేన) :** టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందపురంలో క్షయ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 8వ వార్డు కౌన్సిలర్ కోల ఉదయభాను మాట్లాడుతూ 2030 నాటికి దేశాన్ని క్షయవ్యాధి రహితంగా మార్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం, తేమడలో రక్తపు జీరలు రావడం, రాత్రి వేళల్లో జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో మొత్తం 18 మందికి టీబీ పరీక్షలు



నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ చందన్, ఆరోగ్య కార్యకర్తలు బండారు కవిత, సావిత్రి, సంతోషం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.75 వేల సాయం...

**గరిడేపల్లి ప్రతినిధి మే 22 (సూర్య సేన):**
ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముత్తినేని శ్రీనివాస్ కుటుంబాన్ని రాష్ట్ర తొలి కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు జిల్లా అధ్యక్షుడు బంధు శ్రీధర్ బాబుతో కలిసి శుక్రవారం మండలంలోని కీతవారిగూడెంలో పరామర్శించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా నిలవడంలో కుల సంఘం ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని తెలిపారు.
భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.75



వేల నగదు సహాయం అందజేశారు. కార్యక్రమంలో పాయిలి వెంకటనారాయణ, రామినేని సత్యనారాయణ, యర్రంశెట్టి సైదయ్య, హాసనభాధ రాజేష్, దొంగరి నాగేశ్వరావు, బోలిశెట్టి మధు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

శనివారం, మే 23, 2026

## నియోజకవర్గాల పెంపు ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

ఉమ్మడి ఏపీలో 2014 వరకు 294 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 42 లోక్ సభ స్థానాలు ఉన్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 175 స్థానాలు.. తెలంగాణకు 119 స్థానాలు వెళ్లాయి. అదే సమయంలో లోక్ సభ స్థానాల అంశాన్నే తీసుకుంటే.. ఏపీకి 25 స్థానాలు.. తెలంగాణకు 17 స్థానాలు కేటాయించారు. విభజన చట్టంలో రెండు తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచుతామని చెప్పారు. ఈ లెక్కన ఏపీ అసెంబ్లీలో ఉన్న 175 స్థానాలకు 225 స్థానాలు పెరగాలి. తెలంగాణలో.. ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలు 150కు పెరుగుతాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో ఏపీ రాష్ట్ర వాటా 4.08 శాతం. ఆ నిష్పత్తి ప్రకారం ఏపీకి వచ్చే లోక్ సభ స్థానాలు 33 మాత్రమే.తెలుగు రాష్ట్రాల్లో పెరిగే సీట్లు ఎక్కడ పెరుగుతాయి..? తగ్గే సీట్లు ఎక్కడ తగ్గుతాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. జనాభా ఎక్కువగా ఉన్న పెద్ద నగరాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో తగ్గొచ్చనేది అంచనా. అలా జరిగితే.. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కలే ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే తెలంగాణ జనాభా 3.60 కోట్లు కాగా.. జీహెచ్ఎంసీ జనాభానే కోటి పైగా ఉంది. కాబట్టి ఇక్కడ సీట్లు పెంచక తప్పదు. గతంలో పునర్విభజన జరిగినప్పుడు కూడా హైదరాబాద్‌లో సీట్లు పెరిగిన సంగతిని సీనియర్లు గుర్తుచేసుకుంటున్నారు..ఏతావాతా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నగర ప్రాంతాల్లో సీట్లు పెరిగి.. గ్రామీణ ప్రాంతాల్లో సీట్లు తగ్గుతాయనేది ప్రముఖంగా వినిపిస్తున్న మాట. అలా జరిగితే అర్బన్ ప్రాంతాల్లో పట్టున్న పార్టీలకు, నేతలకు అడ్వాంటేజ్ ఉంటుందనే వాదన వినిపిస్తోంది. తద్వారా గ్రామీణ ఓటర్ల కంటే అర్బన్ ఓటర్లను ఆకట్టుకోవటానికి పార్టీలు, నేతలు ఎక్కువ ప్రయత్నాలు చేస్తారనడంలో సందేహం అక్కర్లేదనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ పరిణామాల్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పార్టీలన్నీ తమ బలాబలాలు, ట్రాక్ రికార్డ్, ఓట్ల శాతం, పట్టున్న ప్రాంతాల లెక్కలు తీసే పనిలో పడ్డాయి. దాన్ని బట్టి భవిష్యత్ రాజకీయ వ్యూహం ఖరారు చేసుకునే పనిలో పడొచ్చని నేతలు భావిస్తున్నారు. పార్టీలకు మాత్రం స్వతహాగా మహిళల్లో అనుకూలత లేదు. కొన్నింటికైతే తమ తప్పు లేకుండానే ప్రత్యర్థుల చాతుర్యం కారణంగా మహిళా వ్యతిరేకులనే ముద్ర పడిపోయింది. ఇప్పటికిప్పుడు ఆ ముద్ర చెరిపేసుకోవడం కుదురుతుందా అనేది కొత్త టెన్షన్. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్లు అమలు కాకుండానే.. ఎన్నికల్లో గెలుపోటములకు మహిళా ఓట్లే కీలకంగా మారుతున్నాయి. ఇటీవలే జరిగిన బీహార్ ఎన్నికల్లో నారీశక్తి ఘనంగా పనిచేసింది. 2029 ఎన్నికల నాటికి ఈ సంఖ్య కనీసం 9కి చేరనుంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మహిళలకు తక్కువ టికెట్లు కేటాయించినప్పటికీ.. భవిష్యత్తులో ప్రతి పార్టీ కచ్చితంగా 9 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ మార్పులు మహిళల గొంతు పార్లమెంటులో మరింత బలంగా వినిపించడానికి దోహదపడతాయని అంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దుల ఆధారంగా లోక్‌సభ స్థానాలను పునర్విభజించాలన్న నిబంధన పెట్టారు. ఈ లెక్కన ముందు అసెంబ్లీ నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 27,41,239 మంది జనాభా ఉన్నారు. ప్రాథమికంగా అందుతున్న సమాచారం, జరుగుతున్న ప్రచారం మేరకు ప్రతి 2లక్షల జనాభాకు ఒక సీటు పెరిగే అవకాశం ఉంది. ఇక లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26 లేదా 27 అయ్యే అవకాశాలున్నాయి. జనాభా లెక్కల ఆధారంగా ఏర్పాటు చేస్తే అత్యధిక జనాభా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎక్కువ ఎంపీ సీట్లు పెరుగుతాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 10 అసెంబ్లీ స్థానాలు, పునర్విభజన అనంతరం 14 లేదా 15 అయ్యే అకాశాలున్నాయి. వీటిలో 33 శాతం కనిష్ఠంగా 4 నుంచి గరిష్ఠంగా 5 స్థానాలు మహిళలకు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ స్థానాలను కలుపుకొనే మహిళల రిజర్వేషన్ కల్పిస్తారు. అంటే రిజర్వేషన్ పురుషులు, మహిళలు అని మారుతూ ఉంటుంది. దీంతో రాజకీయంగా కొత్త వారికి అవకాశాలు వస్తాయి. పురుషులతోపాటు మహిళలు అవకాశాలు అందిపుచ్చుకొనే వీలు ఉంటుంది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వచ్చే ఎన్నికల నాటికి అధికారాన్ని అందుకోవాలని తెగతాపత్రయపడుతోంది. ఇలాంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజనను అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా వ్యవహరించే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. కానీ రాష్ట్రంలో తమకు ఉన్న సంస్థాగత బలం.. ఉపయోగపడుతుందనేది బీఆర్ఎస్ లెక్కగా ఉంది. తెలంగాణలో ప్రస్తుతం 17 పార్లమెంటు నియోజకవర్గాలు ఉండగా, కాంగ్రెస్, బీజేపీ 2024 ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు చొప్పున గెలుచుకున్నాయి. 1971 జనాభా లెక్కల ప్రకారం 1972లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. ఆ తర్వాత? నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు. కానీ? కొన్ని పరిధులు, పేర్ల మార్పుతో 2009లో ఎన్నికలు జరిగాయి. జనాభా గణన అనంతరం విధిగా జరిగే నియోజక వర్గాల పునర్విభజన ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ అన్న సూత్రం ప్రాతిపదికన జరగాలని రాజ్యాంగ నిబంధన పేర్కొంది.


సూర్యసేన

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు అడ్వర్టైజ్మెంట్స్ మరియు వార్తల కోసం

సంప్రదించండి: 9951241048


ఛత్రపతి సాహు మహారాజ్ స్ఫూర్తి తో

# బీసీలు పాలన వైపు అడుగులు వేయాలి

**బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్**



ఛత్రపతి సాహు మహారాజ్ మరాఠాల భోంస్లే రాజవంశానికి చెందిన ఒక యాదవ్ రాజు. ఆయనని ఛత్రపతి రాజర్షి సాహూ, రాజర్షి సాహూ మహారాజ్, కొల్హాపూర్ సాహూ అని కూడా పిలుస్తారు. ఆయన భారత రాచరిక రాష్ట్రమైన కొల్హాపూర్ మొదటి మహారాజు సాహు మహారాజ్ పట్టాభిషేకం 1894 ఏప్రిల్ 2న జరిగింది.ఆ రోజు ఆయన కొల్హాపూర్ సంస్థానానికి రాజుగా అధికారికంగా పట్టాభిషేకంపొందారు. 06-05-1922వరకు దాదాపు 28 సంవత్స రాలు కొల్హాపూర్ సంస్థానాన్ని సామాజిక న్యాయమే లక్ష్యంగా పరిపా లించారు. సామజికఅసమానతలను చూస్తూపెరి గినఛత్రపతి సాహు మహారాజ్ సమానత్వాన్ని నెలకొల్పాలని సంక ల్పించి .సామజిక న్యాయం,సమానత్వం, విద్యా అభివృద్ధికోసం నిరంతరం కృషి చేశారు. వెనక బడిన వర్గాల అభ్యున్నతి కోసం స్త్రీ విద్య కోసం అంటరాని తనం, అమానుషం, పీడన, దోపిడీ, వివక్ష నిర్మూలన కోసం ఆయన పాలన లో తీసుకున్న సంస్కరణలు యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచాయి. 26-07- 1902 లో కొల్హాపూర్ సంస్థానం లో బ్రాహ్మణేత రులైన, బీసీ,ఎస్సి ఇతర వెనక బడిన వర్గాల ప్రజలకు విద్యా, ఉద్యో గాలలో 50శాతం రిజర్వేషన్లను కల్పిస్తు ఉత్తర్వులను జారీచేయడం తోపాటు గ్రామపరిపాలనరంగంలో వంశపార్యా పరంగాకొనసా గుతున్న, పటేల్, పట్వారి, కులకర్ణి వ్యవస్థను రద్దు చేస్తూ సామజిక న్యాయంఅమలు, కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకున్న గొప్ప సంఘ సంస్కర్త ఛత్రపతి సాహు మహారాజ్ , పూలె ను ఆదర్శంగా తీసుకొని స్త్రీలు, బాలికల విద్య కోసం పాఠశాల లను ఏర్పాటు చేసి పూర్తి ఉచితవిద్యనందించడం తోపాటు బాలికలకు హాస్టళ్లను ఏర్పాటుచేశారు. బాల్య వివాహల నిర్మూలన కోసం కృషి చేయడం తోపాటు కులాంతర వివాహలను చట్టబద్దం చేశారు. తన పాలన లో వ్యవసాయమే జీవనాదారంగా బతుకుతున్న రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల పై ఆధారపడి నష్ట పోకుండా సహకార సంఘాలను ఏర్పాటు చేసి రైతులకు, చేయూతనిచ్చారు. 1919మే నెల మూడు తారీకు న వెట్టి చాకిరీ వ్యవస్థ ను రద్దు చేస్తూ చట్టం చేసి బానిసత్వ నిర్మూలనకు శ్రీకారం చుట్టారు. అస్పృశ్యుల హక్కుల సాధన కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్థాపించినమూక్ నాయక్. పత్రికను నడపడానికి సాహు మహారాజ్ రాజు ఆర్థిక సాయం అందించడం తోపాటు అంబేద్కర్ గారు ఇంగ్లాండ్ వెళ్లి ఉన్నత చదువులు చదవడానికి ఆర్థిక సాయం అందించి ఆదుకున్న త్యాగశీలి చత్రపతి సాహు మహారాజు గారు 06-05-1922 నాడు భౌతికంగా ఆయన దూరమైనా ఆయన దేశ ప్రజల మనసుల్లో చిరంజీవి గానిలిచిపోయారు, స్వతంత్రానికి పూర్వమే అణగారిన కులాల ప్రజలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి చరిత్ర సృష్టించారు చత్రపతి సాహు మహారాజ్ హక్కులకు దూరమైన ప్రజల నుండి వచ్చిన నాయకులు మాత్రమే వారి హక్కుల కోసం పనిచేస్తాను, దేశానికి స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలు దాటినా రాజ్యాంగ పలాలు బీసీలకు సంపూర్ణంగా అందకపోవడం సామాజిక న్యాయస్ఫూర్తికి విరుద్ధం, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు,రాజకీయరంగంలో కూడా రిజర్వేషన్లు కావాలని గత 70 సంవత్సరాలుగా బీసీలు పోరాడుతున్నా ప్రజాస్వామ్య దేశంలో మెజార్టీ ప్రజల అరిగోస ను పట్టించుకునే నాధుడే లేడు. చత్రపతి సాహు మహారాజు స్ఫూర్తితో బీసీలు మిలిటెంట్ ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలి. ఓటరుగా మిగిలిపోకుండా, ఓటు బ్యాంకు రాజకీయాలను చదరగొట్టి, మెజార్టీ ఓటరులు పాలనవైపు అడుగులు వేసినప్పుడే చత్రపతి సాహు మహారాజు ఆశించిన, నిజమైన సమ సమాజ నిర్మాణం పూర్తవుతుంది.


# విదేశీ మారక నిల్వలు పెంచడం ఎలా?

### దిగుమతులు దెబ్బతీస్తుంటే తెలియదా? ఎగుమతులను విస్మరించడంతోనే సమస్య

న్యూఢిల్లీ, : మనవిదేశా మారక నిల్వలు పెరగాలంటే ఎగుమతులు పెరగాలి. దిగుమతలు తగ్గాలి. ఈ సూత్రాన్ని పాటించాల్సిన పాలకులు దీనిని పట్టించుకోవడం లేదు. పంటల దిగుబడి పెరుగుతున్నా వాటిని ఆదయ వనరుగా మార్చుకోవడంలో కేంద్రం విఫలం అవుతోంది. విదేశీమారక నిల్వలు తగ్గిపోతుంటే విదేశీ పెట్టుబడిదారులు ఆ దేశంలో తాము పెట్టిన పెట్టుబడులను వెనక్కి తీసేసుకుంటారు. సాధారణంగా 7-10 నెలలపాటు ముడిచమురు దిగుమతులకు సరిపడా విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉంటే ఆ దేశ పరపతి బాగున్నట్టుగా అంచనా వేస్తారు. 1991లో మన దేశం వద్ద కేవలం 2 వారాలకు సరిపడా మాత్రమే విదేశీ మారక ద్రవ్య నిల్వలున్నాయి. అందుకే మన బంగారాన్ని లండన్‌కి పంపి తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఆనాటి చంద్రశేఖర్ ప్రభుత్వం బంగారం తాకట్టు పెట్టింది. పివి నరసింహారావు ప్రధాని అయ్యాక ఆర్థిక సంస్కరణలు చేపట్టడంతో దేశం దారికి వచ్చింది. తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకోగలిగాం. దీంతో మళ్లీ మనదేశ ఆర్థిక వ్యవస్థ గాడిన పడిందంటే ఆ మహానుభావుడి చొరవే కారణం. ఇప్పుడు మోడీ కూడా అలాంటి చొరవ లేదా సంస్కరణలకు దిగాలి. మూడీస్, ఎస్ అండ్ పి, ఫిచ్ వంటి అంతర్జాతీయ సంస్థలు.. ఫారెక్స్ రిజర్వ్ ఎక్కువగా ఉన్న దేశాలకు మంచి రేటింగ్ ఇస్తాయి. ఆ రేటింగ్ ఎంత ఎక్కువ ఉంటే అంత తక్కువ వడ్డీకి అప్పులు లభిస్తాయి. ఒక దేశం విదేశాల నుంచి అప్పు తీసుకోవాలనుకుంటే.. ఆయా దేశాలు సదరు దేశం వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఎంత ఉన్నాయనే విషయాన్నే చూస్తాయి. ఇప్పుడు మన వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు దాదాపు 9 నుంచి 11 నెలలకు సరిపడా ఉన్నప్పటికీ.. పరిస్థితులు మన చేతుల్లో లేవు. పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ముగిసేలాగా కనిపించట్లేదు. ముడిచమురు ధరల భారంతోపాటు.. ఎరువుల ధరలు కూడా భారీగా పెరిగిపోయే ప్రమాదం కనపడుతోంది. అంటే వాటి దిగుమతుల కోసం చేయాల్సిన ఖర్చు మరింతగా పెరిగిపోయి డాలర్ల రిజర్వు అనుకున్నదానికంటే వేగంగా కరిగిపోయే ముప్పుంది. దీనికితోడు.. మనకు వచ్చే విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుంచి వచ్చేవే. అక్కడున్న భారతీయులు మనదేశంలో ఉన్న తమ కుటుంబసభ్యులకు పంపే డబ్బు కారణంగా విదేశీ మారకం భారీగా పెరిగింది.. యుద్ధం దెబ్బకు అతలాకుతలమైన గల్ఫ్ దేశాల్లో ఉంటున్న మనవాళ్లు పంపే డబ్బు తగ్గిపోతోంది. దీనికితోడు.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మన ఎగుమతులకు, తద్వారా మనకు రావాల్సిన డాలర్లకు కూడా ఆటంకం కలుగుతోంది. ఒకవైపు మనకు రావాల్సిన విదేశీ మారక ద్రవ్యంలో కోత పడుతుండగా, మరోవైపు మన వద్ద ఉన్న నిల్వలు కరిగిపోతున్నాయి. 2025-26 బడ్జెట్ అంచనాల ప్రకారం, దేశ జాతీయ రుణం అక్షరాలా రూ.235.4 లక్షల కోట్లు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే నాటికి మన అప్పు కేవలం రూ.54.9 లక్షల కోట్లు మాత్రమే. అంటే, కేవలం పదేండ్ల కాలంలో దేశం చేసిన అప్పు 4.3 రెట్లు పెరిగింది. ప్రతి భారతీయుడిపై సగటున రూ.1.66 లక్షల అప్పు ఉన్నది. జీడీపీలో అప్పు నిష్పత్తి 67 శాతం నుంచి 83.9శాతానికి చేరుకున్నది. భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని పాలకులు గర్వంగా చెప్తుంటారు. 3.73 ట్రిలియన్ల డాలర్ల జీడీపీతో మనం ఆ స్థానంలో ఉన్నమాట నిజమే. కానీ, ఇందులో ఒక పెద్ద మాయ ఉన్నది. ఒక దేశం ఎంత ధనవంతమైనదో చెప్పాల్సింది దాని మొత్తం ఆదాయం కాదు, ఆ దేశ పౌరుడి తలసరి ఆదాయం. దేశ ఆర్థిక శక్తిని తలసరి ఆదాయపరంగా విశ్లేషిస్తే విస్తుపోయే వాస్తవాలు కనిపిస్తాయి. ఆదాయ పంపిణీలో ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మనం ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నామని, సంపద కేవలం పైస్థాయిలోనే కేంద్రీకృతమై సామాన్యుడి వరకు ఆశించిన స్థాయిలో చేరటం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక్క అమెరికన్ సంపాదన మన దేశంలోని 30 మంది పౌరుల మొత్తం ఆదాయంతో సమానం. జనాభాపరంగా మనం పెద్ద దేశం కాబట్టి జీడీపీ పెద్దదిగా కనిపిస్తుంది. కానీ పౌరుడి జీవన ప్రమాణాల విషయానికి వస్తే ఐఎంఎఫ్ లెక్కల ప్రకారం మనం ప్రపంచంలో 136వ స్థానంలో ఉన్నాం. 2014 ఎన్నికల సమయంలో రూపాయి విలువ పడిపోతుంటే అప్పటి పాలక వర్గాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. అప్పుడు డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.60. ఇప్పుడు అది రూ.94 దాటిపోయింది. పదేండ్లలో రూపాయి విలువ 40శాతం పైగా కుప్పకూలింది. రూపాయి బలహీనపడటం అంటే మనం విదేశాల నుంచి కొనే పెట్రోల్, డీజిల్, వంట నూనె ధరలు పెరగటం. ఈ భారం నేరుగా సామాన్యుడి వంటగదిపై పడుతున్నది. దేశానికి వెన్నెముక వంటి యువత ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నది. ప్రతి ఏటా కోటిన్నర మంది ఉద్యోగ మార్కెట్‌లోకి వస్తుంటే, ప్రభుత్వం సృష్టిస్తున్న అవకాశాలు కేవలం కొన్ని లక్షలు మాత్రమే. ఆర్థిక వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని చెప్పి చేపట్టిన నోట్ల రద్దు దేశాన్ని కుదిపేసింది. జీఎస్టీ అమలు ఒకే దేశం ఒక పన్ను అనేది వినటానికి బాగున్నా, దాని సంక్లిష్టమైన స్లాబ్‌లు చిన్న వ్యాపారులకు శాపంగా మారాయి. కోట్లాది చిన్న తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య ఆదాయ పంపిణీ గొడవలు నిత్యకృత్యమయ్యాయి. అచ్ఛే దిన్ అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోయింది.

# ఒత్తిడిలో పడితే నిర్వీర్యమే



మనిషికి ఒత్తిడి వల్ల ఎదురయ్యే అనర్థాలెన్నో... లెక్కలేనన్ని మానసిక, ఆరోగ్య సమస్యలు వస్తాయి చివరకు సంతానోత్పత్తి సామర్థ్యమూ దెబ్బతింటుంది వీర్యకణాల సంఖ్యను, బలాన్ని కుదించేస్తుంది. అందుకే ఒత్తిడి వద్దు... సోదరా! అధిక ఒత్తిడి వల్ల సంతానోత్పత్తి సమస్యలూ వస్తాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వీర్యకణాల సంఖ్య పడిపోవడానికి, అవి బలహీనంగా కదలడానికి- అధిక ఒత్తిడి స్థాయిలతో సంబంధం ఉందని పరిశోధనలు తేల్చాయి. పురుషులు నిరంతరం ఒత్తిడికి లోనవడం వీర్యకణాల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడా విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జామిన్ బ్రహ్మభట్ అంటున్నారు. ఏం జరుగుతుంది?:ఒత్తిడి వల్ల.. శరీరం చేసే పనుల తీరు తెన్నులే మారిపోతాయి. ఒత్తిడి కలిగినప్పుడు, శరీరం కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లను విడుదల చేస్తుంది. ఒత్తిడి సమయాల్లో మనం స్పందించడానికి సహాయపడే శరీర అంతర్నిర్మిత హెచ్చరిక వ్యవస్థలో ఇదో భాగం. స్వల్పకాలంలో ఇది మంచిదే. కానీ ఒత్తిడి వారాలు, నెలల పాటు కొనసాగినప్పుడు నిద్ర దెబ్బతింటుంది. శక్తి తగ్గిపోతుంది. మానసిక స్థితి మారుతుంది. బరువు పెరుగుతాం. లైంగిక వాంఛ తగ్గిపోతుంది. కొందరు దుర్వ్యసనాలకు అలవాటు పడతారు. దీనివల్ల సంతానోత్పత్తి సమస్యల్ని ఎదుర్కొంటారు. శుక్రకణాలు ఉత్పత్తి అయి, పరిపక్వం చెంది, వీర్యంలో కనిపించడానికి సుమారు రెండు, మూడు నెలల సమయం పడుతుంది. దీర్ఘకాలిక అలసట, నిద్రలేమి.. శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను పెంచుతాయి. ఇది శుక్రకణాలను నేరుగా దెబ్బతీస్తుంది. అధిక ఒత్తిడి స్థాయిలు శుక్రకణాల సంఖ్య తగ్గిపోవడం, అవి బలహీనంగా కదలడం, సరైన ఆకారం లేకపోవడం వంటి వాటికి దారితీస్తాయని పరిశోధనలు తేల్చాయి. దాదాపు 1,200 మందికి పైగా పురుషులపై జరిపిన ఓ అధ్యయనంలో- మధ్యస్థాయి ఒత్తిడి ఉన్న వారితో పోలిస్తే అధికస్థాయి ఒత్తిడి ఉన్నవారిలో వీర్యకణాల సాంద్రత, సంఖ్య బాగా తక్కువగా ఉన్నట్లు తేలింది.

ఏం చేయాలి?: ఒత్తిడి ఎందువల్ల కలుగుతుందో తొలుత గుర్తించాలి. తగినంతగా నిద్రపోతున్నారా? శారీరకంగా చురుకుగా ఉంటున్నారా? ఎక్కువగా మద్యం తాగుతున్నారా? మాదకద్రవ్యాలు వాడుతున్నారా? ఇత్యాది అంశాల్ని విశ్లేషిస్తే వారు ఎలాంటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారో గుర్తించొచ్చు. డిజిటల్ వ్యాపకం మనలో విపరీతమైన ఒత్తిడి భావనలు కలగజేస్తుంది. చాలావరకు దానికి బానిస కాకుండా చూసుకోవాలి. నిద్ర టెస్టోస్టిరోన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. వీర్య కణాల వృద్ధికి టెస్టోస్టిరోన్ చాలా అవసరం. అందువల్ల 7 నుంచి 9 గంటలు నిద్రపోవడం మంచిది. క్రమం తప్పని శారీరక శ్రమ హార్మోన్ల నియంత్రణకు, కార్టిసాల్‌ను తగ్గించడానికి, ఆరోగ్యకరమైన బరువును కాపాడుకోవడానికి సహాయపడుతుంది. జిమ్‌లో కఠినంగా వ్యాయామం చేయడం కంటే శరీర నిరంతర కదలికలు ముఖ్యం. అధికబరువు పురుషుల్లో ఈస్ట్రోజెన్ స్థాయిల్ని పెంచుతుంది, ఇది టెస్టోస్టిరోన్‌ను అణచేసి, వీర్య కణాల ఉత్పత్తిని ప్రేరేపించే హార్మోన్ల సంకేతాలకు అంతరాయం కలిగిస్తుంది. అందువల్ల బరువు తగ్గించుకోవడం మంచిది. కోటిన్, గంజాయి, అధిక ఆల్కహాల్ ఇవన్నీ వీర్యకణాలు తగ్గిపోవడానికి, బలహీనమైన చలనానికి, అసాధారణ కణ ఆకృతులకు కారణమవుతాయి. వీటిని తగ్గించుకోవడం మన చేతుల్లో ఉంటుంది.

# ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం అవసరం





**– రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**నల్గొండ, మే 22 (సూర్య సేన) :** ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా గురువారం నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని బైపాస్ వద్ద ఉన్న ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన జిల్లాస్థాయి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ముఖ్యంగా రైతులకు రైతు బీమా, రైతు భరోసా అలాగే 6 గ్యారంటీల వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నది చెప్పారు. అయినప్పటికీ వివిధ రంగాలలో ఇంకా నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు పంటల మార్పిడికి వెళ్లాలని, దేశ,కాల , వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. రోజురోజుకు తగ్గిపోతున్న పశు సంపదను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలు ఉత్పన్నం అయ్యేందుకు మనమే కారణం కావద్దని, సమస్యల పరిష్కారం పై లోతుగా ఆలోచించాలన్నారు. విద్య, సాగునీరు ,వైద్య రంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు, మోడల్ పాఠశాలలు ఏర్పాటు, విద్యార్థులకు యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నదని, అంతేకాక రానున్న విద్యా సంవత్సరం నుండి అల్పాహారం కూడా అందించనుందని తెలిపారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేసినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నదని ,ఈ విషయంపై దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. గ్రామాలలో పారిశుధ్యం కోసం ట్రాక్టర్లు ఏర్పాటు చేశామని, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ చేయడం జరిగిందన్నారు. దేశంలో ఏ





రాష్ట్రంలో చేయని విధంగా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తున్నామని, జూన్ 2 నాటికి జిల్లాలో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ఇంకా పలు కార్యక్రమాలు. చేయాల్సి ఉందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన తెలిపారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక ద్వారా అనేక కార్యక్రమాలను ప్రజల దగ్గరికి తీసుకు వెళ్ళినట్టు చెప్పారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక ప్రజల కార్యక్రమాలతో అంకితమైన కార్యక్రమం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను, త్వరలో అమలు చేయనున్న కొత్త పథకం కుటుంబ జీవిత బీమా పథకాన్ని వివరించారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నప్పటికీ ఇంకా సమస్యలు ఉన్నాయని, వాటిపై కూడా దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్చి 6న ప్రారంభమైన ప్రజాపాలన–



ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలను, సాధించిన విజయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ కార్యక్రమం తో పాటు, అలైవ్ ,అరైవ్ , రోడ్డు భద్రత పై తీసుకున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# జీవ వైవిధ్య సంరక్షణ తోనే మానవ మనుగడ

జనాభా పెరుగుదల అభివృద్ధి పేరున వనరులను మితిమీరి వినియోగించడం

విచక్షణా రహిత పారిశ్రామికీకరణ ఆధునిక' సాంకేతిక విజ్ఞానం వినియోగించిన ఫలితంగా జీవ వైవిధ్య పరిరక్షణ ఒక సంక్లిష్ట సవాల్ గా పరిణమించింది. భారీ ప్రాజెక్టుల నిర్మాణం పరిశ్రమల ఏర్పాటు కొరకు అడవుల నరికివేత యథేచ్ఛగా గనుల తవ్వకం ' ప్రణాళికా రహిత నగరీకరణ అణువిద్యుత్ కేంద్రాలు' ప్లాస్టిక్ వినియోగం 'వ్యవసాయంలో మితిమీరి వాడుతున్న రసాయనిక ఎరువులు క్రిమిసంహారక మందుల వినియోగం మొన్నగు తదితర అంశాలు జీవవైవిధ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి . ఫలితంగా భూమి పైజీవిస్తున్న కోట్లాది జీవరాశుల్లో మూడింట రెండువంతులు అంతరించె ప్రమాదం ఉందని సర్వేలో తేలింది.

ప్రకృతి మానవ శ్రేయస్సు

ప్రకృతి మానవాళికి జీవనాధారం మానవ ఆరోగ్యం' ఆహారం' ఆర్థిక వ్యవస్థ' అభివృద్ధి 'శ్రేయస్సు ప్రకృతి పై ఆధారపడి ఉంది.

జీవ వైవిధ్యం ప్రపంచీకరణ కర్పోరేటీకరణ ప్రభావం వల్ల ప్రకృతి సంక్షోభంలో పడింది.తత్ఫలితంగా

ప్రపంచములో 80 లక్షల వృక్ష 10 లక్షల జంతుజాతులు అంతరించి పోయే ప్రమాదం వుందని అంతర్జాతీయ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

జీవ వైవిధ్యం సుస్థిర జీవనోపాధి

పర్యావరణ రక్షణ పేదరిక నిర్మూలన సుస్థిర జీవనోపాధి సమాన అభివృద్ధి సాధించాలంటే జీవ వైవిధ్యం బహుముఖ పాత్ర పోషిస్తుంది. మే 22 న అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం జరుపాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది

మానవాళి మనుగడ బి జీవ వైవిధ్యం మానవాళి మనుగడ ప్రకృతి 'పర్యావరణం జీవవైవిధ్యం మీద ఆధార పడి ఉంది. భూగోళం పై ఉన్న వివిధ జీవుల మధ్య ఉన్న భేదాన్ని జీవవైవిధ్యం అంటారు.నేడు మన భూమి పైఅనేక మిలియన్ల వివిధ జాతుల మీద జీవవైవిధ్యం సుమారు3.5 బిలియన్ సంవత్సరాల పరిమాణం. మన జీవన శైలితో పర్యావరణ కాలుష్యము పెరిగి భూగోళంవేడెక్కిపోతుంది .దాదాపు 20 ఏళ్ళలో ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలు 150 శాతం మేర పెరిగాయని పర్యావరణ పరిశోధకులు వెల్లడించారు. వాతావరణ భూ భౌతిక వైపరీత్యాల వల్ల13 లక్షల మంది మరణించారు. సముద్ర మట్టాలు సాగరాల ఆమ్లత పెరుగుతుంది. రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరిగి దాదాపు 10 లక్షల మొక్కలు జీవజాతులు కనుమరుగయ్యే స్థితి పొంచి వుంది.

భూమి ఏర్పడి 350 కోట్ల సంవత్సరాలు అయ్యింది. ప్రపంచ వ్యాప్తంగా కోటి40 లక్షల జీవ రాశులు ఉన్నాయి. వీటిల్లో 80లక్షలు మాత్రమే గుర్తించాం. మన దేశంలో కేవలం17 లక్షల జీవరాశుల సమాచారం మాత్రమే వుంది. ప్రపంచ వ్యాప్తంగా అధిక వృక్ష' జల జీవరాశులు ఉన్నదేశాల్లో భారత్ 12 వ స్థానంలో వుంది. ఇప్పటికీ మన దేశంలో జీవ వైవిధ్యం పై 60 శాతం మంది ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వాలు అవలంబించిన విధానాల వల్ల గత దశాబ్దాలలో దేశంలో 50 శాతం పైగా అడవులు 70 శాతం పైగా జల వనరులు తగ్గిపోయినాయి.

దీనితో జీవవైవిధ్యం దెబ్బతిని ఎన్నో జాతులు అంతరించి పోతున్నాయి. పిచ్చుక ప్రతి ఇంటిలో కనిపించేది రాను రాను అవి కనుమరుగై పోతున్నాయి.

జీవులన్ని బతకాలి భూమి పైఉన్న ప్రాణులన్నీ బతకాలి మిగతా ప్రాణుల మీద జీవవైవిధ్యం ఆధరాడి వుంది. అన్ని ప్రాణులకు ఆహారం దొరకాలంటే జీవులన్నీ బతకాలి జివవైవిధ్యం నిలవాలి.

ధురాశ లాభాపేక్ష జీవవైవిధ్యం

మహాత్మాగాంధీ .చెప్పినట్లు మనిషిలో దురాశ లాబాపేక్ష వల్ల ప్రకృతి విధ్వంసానికి గురిఅవుతుంది. లాభాల వేటలో పర్యావరణానికి హాని చేసే పారిశ్రామిక ఉత్పత్తులకు పారిశ్రామిక వేత్తలు పాల్పడటం కొనసాగుతుంది.

గ్రామీణ ప్రాంతాల్లో వన్యప్రాణుల వేట గ్రామీణ ప్రాంతాలలో పంటల రక్షణ కొరకు రైతులు వాడుతున్న కరెంటు కంచెలు' వేటగాళ్లు విద్యుత్తు తీగలు ఏర్పాటు చేసి వన్య ప్రాణులను వేటాడుతున్నరు. మైనింగ్ 'క్వారీ పేలుళ్ల వల్ల వన్య ప్రాణులు మరణిస్తూన్నాయి. అడవుల నరికి వేత అక్రమ కలప రావాణా వల్ల జీవ వైవిధ్యం దెబ్బతింటుంది.

అంతరించి పోతున్న బి జీవ జాతులు అడవుల్లో వన్య ప్రాణుల వేట 'సముద్రాలలో జలచరాలు వేటాడటం చిత్తడి నేలలు మాయంకావడం వల్ల జీవ వైవిధ్యం ప్రమాదంలో పడింది. నేటి వరకు భూమి మీద 14.36 లక్షల జాతులకు చెందిన జీవరాశులు ఉన్నట్లు గుర్తించారు.ప్రతి యేటా 1.6 కోట్ల ఎకరాలలో అడవులు అంతరిస్తున్నాయి. 20 వేల జాతులు కనుమరుగవుతున్నాయి.75 శాతం పంటలు' 24 శాతం క్షీరదాలు '12 శాతం పక్షి జాతులు అంతరించే దశలో వున్నాయి. ప్రపంచ భూభాగంలో 2.4 శాతం భూభాగం వున్న భారత దేశం లో జీవవైవిధ్యం 8.1 శాతం.వుంది. జీవవైవిధ్యం రక్షణలో ప్రభుత్వ నిర్లక్ష్యం రాజ్యమేలడం శోచనీయం.

పర్యావరణ చట్టాలు అమలు

భారత రాజ్యాంగ అధికరణ 48(ఏ) ప్రకారం ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న పర్యావరణ పరిరక్షణ చట్టా లను ప్రభుత్వం అమలు చెయ్యాలి. ప్రకృతి పర్యావరణానికి నష్టం జరిగితే పౌరులు ప్రభుత్వానికి తెలియచేయాలి.

పర్యావరణ రక్షణ సామాజిక బాధ్యత రాజ్యాంగం లోని 21 వ అధికరణం ప్రతి పౌరునికి జీవించే హక్కును ఇచ్చింది. జీవించే హక్కు బాగంగా మంచి గాలి నీరు ఆరోగ్యకరమైన వాతావరణం లో బతికే హక్కు కూడా వుంది. పౌరులు పరువరణ రక్షణ తమ విధిగా సామాజిక బాధ్యత గా గుర్తించాలి.

ఆదివాసీల సంస్కృతి రక్షణ జీవ వైవిధ్యం భారత దేశములో 53 మిలియన్స్ ఆదివాసీలు కొండ జాతి గిరిజనులు నివసించే ప్రాంతాలలో జీవ వైవిధ్యం రక్షణ వారి సంస్కృతిలో భాగమైంది. దేశంలో 53 తెగలు వున్నాయి. అరుణాచల్ ప్రదేశ్ మేఘాలయ' మిజోరం 'నాగాలాండ్ ప్రాంతాలలో 80 శాతం గిరిజనులు ఉన్నారు' అక్కడ జీవవైవిధ్యం ఎక్కువగా వుంది.

జీవన శైలి లో మార్పులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా

పారిశ్రామిక కాలుష్యాన్ని అరికట్టే చర్యలు చేపట్టాలి.

1)జీవావరణం పర్యావరణం ప్రకృతి రక్షణ మధ్య సంతులిత విధానాలను అమలు చెయ్యాలి.

2)ప్రజలు జంతువులను పక్షులను మొక్కలను రక్షించాలి.

3)జంతు చర్మాలతో తయారుచేసిన వస్తువులను వాడకూడదు.

4)ప్రభుత్వం అభివృధి పేరుతో ఒక చెట్టును నరికితే 10 చెట్లు నాటాలి.అన్న నిబంధనను కచ్చితంగా అమలు చెయ్యాలి. 5)జీవ వైవిధ్య వనరుల.పరిరక్షణలో పౌరులు అందరూ భాగస్వాములు కావాలి

జీవ వైవిధ్యాన్ని రక్షించే చర్యలు

1)అటవీ వినాశనాన్ని అరికట్టాలి

2).ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

3)ప్రకృతి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి.

వ్యవసాయంలో ఎరువులు' పురుగు మందులు వాడకాన్ని నిషేధించాలి.

4)నేల కాలుష్యాన్ని భూమి కోతను అరికట్టాలి

5)పారిశ్రామిక వ్యర్థాలను అరికట్టాలి

ఘన ద్రవ వ్యర్థాలను విచ్చల విడిగా పారవేయడం అడ్డుకోవాలి

6) ప్రజలు జంతువులను వణ్య ప్రాణులను వేటాడం వేయడం మానుకోవాలి. వన్య ప్రాణుల రక్షణ చట్టాల పట్ల అటవీ అధికారులు గ్రామీణులకు అవగాహన కలిగించాలి.

జీవవైవిధ్యాన్ని పాఠ్యాంశంలో చేర్చాలి కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానంలో బాగంగా జీవవైవిధ్యాన్ని పాటశాల 'కళాశాల స్థాయిలో పాఠ్యాంశంగా చేర్చి విద్యార్థులకు జీవవైవిధ్యం మీద ప్రాజెక్టులు 'పరిశోధన చేసేట్లు విద్యా ప్రణాళికలు రూపొందించి అమలు చెయ్యాలి.

జీవ వైవిధ్యం కళా రూపాల్లో అవగాహన ప్రభుత్వం జానపద కళలు' వీధి నాటకాలు వివిధ కళారూపాలను ప్రదర్శించి గ్రామీణులకు పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ చట్టాల మీద జీవవైవిధ్యం పట్ల అవగాహన కలిగించాలి.

జీవ వైవిధ్యం రక్షకులకు అవార్డ్స్ ఇవ్వాలి జీవవైవిధ్య పరిరక్షణకు ప్రకృతి 'పర్యావరణ రక్షణకు పాటుపడుతున్న.వారికి సంస్థలకు వ్యక్తులకు ' ప్రభుత్వం అవార్డ్స్ ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలి.

జీవవైవిధ్యం మీద శిక్షణ ప్రభుత్వం స్వచ్ఛంధ సంస్థలకు సామాజిక సేవ సంస్థలకు మహిళా సంఘాలకు యువజన సంఘాలకు పర్యావరణ పరిరక్షణ వాతావరణ కాలుష్యం నివారణ ప్రకృతి రక్షణ చట్టాల మీద జీవవైవిధ్యం మీద శిక్షణ శిబిరాలు చైతన్య సదస్సులు నిర్వహించాలి

జీవవైవిధ్యం పరిశోధన దేశంలోని అన్ని యూనివర్సిటీలలో జీవ వైవిధ్యం పరిరక్షణకు పరిశోధన చేయటానికి ప్రభుత్వము.బడ్జెట్లో నిధులు కేటాయించాలి.భవిశ్యతులో ఏర్పడే వైరసులు ప్రకృతి వైపరీత్యాల పట్ల అవగాహన కలిగించి జాగ్రత్తలు సూచించాలి.

జీవ వైవిధ్యం మీడియా పత్రికలు ప్రసార సాధనాలు ప్రచార సాధనాలు సోషల్ మీడియా 'సినిమా టి 'వి లో నూతన శైలిలో వాడుక భాషలో జీవవైవిధ్యం రక్షణ ప్రాధాన్యత ప్రయోజనాల పట్ల సరళ భాషలో ప్రజలకు అర్థమయ్యే కార్యక్రమాలు చేపట్టాలి.

జీవ వైవిధ్యం సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వము ఆర్థిక పాలన విధానాలను రూపొందించి అమలు చెయ్యాలి. ప్రభుత్వంతో పాటు పౌరసమాజం వివిధ వృక్ష జీవ జాతుల రక్షణ కొరకు కృషి.చెయ్యాలి

పర్యావరణ హితమైన ఉత్పాదకాలను వినియోగిస్తూ జీవవైవిధ్య సంరక్షణకు దోహదపడే ప్రత్యేక అభివృధి వ్యూహాలతో ప్రభుత్వం క్రియాశీల కార్యాచరణ ప్రణాళికల అమలుతో మానవ మనుగడ సాధనకు పునరంకితం కావాలని ఆశిద్దాం



నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం 9440245771 కరీంనగర్

## ఉద్యమ మిత్రుల సమావేశానికి హాజరుకావాలి



**– యడ్ల విజయ్ పిలుపు**

**హుజూర్‌నగర్ ప్రతినిధి, మే 22 (సూర్యసేన) :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమ మిత్రుల సమావేశానికి హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ కార్యదర్శి యడ్ల విజయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిజమైన ఉద్యమకారులకు గుర్తింపు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీని స్వాగతిస్తున్నామని తెలిపారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నూకల చంద్రం, నజరబోయిన వెంకటేశ్, గుండొజు గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీలో కాపు నేతల యాక్టివ్...

**విజయవాడ, మే 22 (సూర్యసేన) :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక వింత వాతావరణం కనిపిస్తోంది. ఆ పార్టీ అధికారంలో ఉండగా పదవులు, ఆర్థికంగా లాభ పొందిన వారిలో రెడ్డి సామాజిక వర్గం నేతలు అధికం. కానీ ఇప్పుడు ఆ పార్టీకి ఓటమి ఎదురైన తర్వాత పూర్తిగా సామాజిక వర్గం నేతలు సైలెంట్ అయ్యారు. జగన్ ఎంతవరకు కాపు నేతలతో రాజకీయం చేస్తున్నారు. తమ వారిని మాత్రం రక్షించుకునే పనిలో ఉన్నారు. ఈ రాజకీయం తెలియక వైసీపీలో కాపు నేతలు జగన్ చట్రంలో ఇరుక్కుపోతున్నారు. ఆర్థికంగా, రాజకీయంగా ప్రయోజనాలు రెడ్డి సామాజిక వర్గం నేతల వైతే.. కేసులతోపాటు వివాదాస్పద ముద్ర కాపు నేతలకు దక్కుతోంది. ఇది ఎంత మాత్రం కాపు నేతలు గ్రహించడం లేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో..వైసీపీ ప్రభుత్వంలో సకల శాఖామంత్రిగా ఉండేవారు సజ్జల రామకృష్ణారెడ్డి. రాజ్యసభ సభ్యుడితో పాటు టీటీడీ చైర్మన్ పదవి అనుభవించారు వైవి సుబ్బారెడ్డి. ఉత్తరాంధ్రకు సమన్వయకర్తగా ఉంటూ.. బాగానే వెనకేసుకున్నారు విజయసాయిరెడ్డి. అమరావతి పై విషం కక్కుతూ అడుగడుగునా అడ్డుకున్నారు ఆళ్ల రామకృష్ణారెడ్డి. రాయలసీమను తన కనుసైగతో శాసించారు పుంగనూరు పెద్దిరెడ్డి. తాడిపత్రిలో సవాల్ చేస్తూ నిలిచారు కేతిరెడ్డి పెద్దారెడ్డి. గుడ్ మార్నింగ్ ధర్మవరం అంటూ హడావిడి చేసేవారు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి. లిక్కర్ స్కాంతో ఎంతో కొంత వెనుకేసుకున్నారు పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. ఇలా చెప్పుకుంటూ పోతే రెడ్డి సామాజిక వర్గమే సింహభాగం లబ్ది పొందింది. అయితే ఇప్పుడు ఓటమి ఎదురు కావడంతో వారంతా సైలెంట్ అయ్యారు.రెడ్డి సామాజిక వర్గం వెళ్లిపోవడంతో కాపు సామాజిక వర్గంతో రాజకీయం చేస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. ఇది గ్రహించక కాపు నేతలు రెచ్చిపోతున్నారు. అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్,బొత్స సత్యనారాయణ లాంటి వారితో రాజకీయాలు చేస్తున్నారు. మధ్యలో విడదల రజిని, జోగి రమేష్ లాంటి వారితో మాట్లాడిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయిస్తున్నారు. వీరు సైతం జగన్ ఎంత చెబితే అంతా అన్నట్టు వ్యవహరిస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని, పదవులను, ఆర్థిక ప్రయోజనాలను పంచుకున్న వారు మాత్రం ఇటువైపు చూడడం లేదు. అయితే ఇందులో జగన్ కుల ప్రయోజనం ఉంది.

# ఐక్యతతోనే బహుజనులకు రాజ్యాధికారం





-ప్రజా ప్రభుత్వంలో మాలలకే సీట్లు, పదవులు
-ప్రతి నియోజకవర్గంలో 50 వేల మాదిగ ఓటర్లు
-మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు
-బీసీల సహకారంతో మాదిగలు రాజ్యాధికారం
-మాదిగల మహాశక్తి జండా ఎగరాలని పిలుపు, మాదిగల ఆత్మీయ సమ్మేళనం

**సూర్యాపేట, మే 22 (సూర్య సేన) :** ఐక్యతతోనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు అన్నారు. జిల్లా కేంద్రంలో జే ఫంక్షన్ హాల్లో మాదిగల ఓట్లు మాదిగలకే అనే నినాదంతో మాదిగ మహాశక్తి నాయకులు సగరపు ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.
స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా కానీ మాదిగల బతుకులు మారడం లేదని రాష్ట్రంలో 70 లక్షల మంది మాదిగలు ఉంటే అగ్రకులాలైన రెడ్లు, కమ్మలు వెలమలు, అధికారాన్ని చలాయిస్తూ మాదిగలను, బహుజన కులాలను పావులుగా, ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగల ఓట్లు మాదిగలకే వేసుకుంటే మన సత్తా ఏందో తెలుస్తదని ఓటుకి ఎంత బలం ఉందో అగ్రకులాల కు వణుకు పుడుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో 50 వేలకు మంది పైగా మాదిగలు ఉన్నారని మన ఓట్లు మనమే వేసుకుంటే బీసీల సహకారంతో మాదిగలు రాజ్యాధికారాన్ని ఏర్పాటు చేయువచ్చని




అన్నారు. మాదిగల మహాశక్తి జండా ఎగరాలని రిజర్వేషన్లు ఉన్న ఫలాలు అందటంలో పాలకులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో మాల కుటుంబాలకే, సీట్లు మంత్రి పదవులు దక్కాయని ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్, ప్రొఫెసర్ కనకయ్య, దుర్గయ్య గౌడ్, బండారు సుధాకర్, కేవీ, మాచర్ల సైదులు, డేవిడ్, మస్తాన్, దయానందశీ, జయశంకర్, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పీఎంజీఎస్‌వై పనులకు తెలంగాణకు మరిన్ని అనుమతులు, నిధులు ఇవ్వాలి : మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 22 (సూర్య సేన) :**రాష్ట్రాలపై 40 శాతం భారం వేయకుండా, గతంలో మాదిరిగా 100% నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించాలి ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ, వన్యప్రాణి చట్టాల వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయిఆదివాసీల అభివృద్ధికి అడ్డుగా ఉన్న చట్టాలను సవరించాలి దక్షిణాది రాష్ట్రాల ఖఓఊజ ప్రాంతీయ సమావేశంలో మంత్రి సీతక్క విజ్ఞప్తిసానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం చూపిస్తామని వెల్లడిప్రధాన్ మంత్రి గ్రామ సడక్ యోజన (ఖఓఊజ) కింద తెలంగాణకు మరిన్ని రహదారి పనులు మంజూరు చేయాలని, ముఖ్యంగా ఆదివాసి గిరిజన మారుమూల ప్రాంతాల్లో రహదారి అనుసంధానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌ల దక్షిణాది రాష్ట్రాల ఖఓఊజ ప్రాంతీయ సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొని రాష్ట్ర సమస్యలు, అవసరాలను కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి అతిథి సింగ్, ఎన్‌ఆర్ఐడీఏ డైరెక్టర్ జనరల్, దక్షిణాది రాష్ట్రాల అధికారులు, ఇఔఅ లు, అఇ లు పాల్గొన్నారు.?ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా ఖఓఊజ గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మార్కెట్లకు రాకపోకలను మెరుగుపరిచిందన్నారు. ప్రస్తుతం ఈ పథకం మారుమూల గ్రామాలు, ఆదివాసి గిరిజన గూడెలను, మైదాన ప్రాంతాలతో అనుసంధానం చేస్తుంది అన్నారు.అయితే గతంలో ప్రధానమంత్రి గ్రామీణ యోజన పథకానికి 100% నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించేదని, కానీ కేంద్ర ప్రభుత్వం నిబంధనలు మార్చి రాష్ట్రాలపై 40 శాతం భారం వేస్తోందని, ఆ విధానాన్ని పునఃసమీక్షించాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన, భౌగోళికంగా క్లిష్టమైన ప్రాంతాల రాష్ట్రాలకు ప్రత్యేక సడలింపులు అవసరమని తెలిపారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ ఆసిఫాబాద్ వంటి ఆదివాసి, గిరిజన ప్రాంతాల్లో అటవీ, వన్యప్రాణి చట్టాల కారణంగా రోడ్డు పనులకు అనుమతులు ఆలస్యమవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. గిరిజనాభివృద్ధి, గ్రామీణ రవాణా సౌకర్యాల దృష్ట్యా అటవీ, వన్యప్రాణి నిబంధనల్లో అనుకూల మార్పులు చేయాలని కేంద్రాన్ని కోరారు.ప్పటికే ఉన్న పాత రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్న ప్రాంతాల్లో పునర్నిర్మాణం, అప్‌గ్రేడేషన్ పనులకు కూడా అటవీ నిబంధనలు అడ్డంకిగా మారాయన, ఆయా పనులకు సులభంగా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అటవీ సంరక్షణ చట్టాల్లో ఈ మధ్య తెచ్చిన మార్పులు ఆదివాసీల అభివృద్ధికి అటంకంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. లంగాణ ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, నాణ్యమైన రోడ్ల నిర్మాణం, నిర్వహణలో ఆధునిక సాంకేతికతలను వినియోగిస్తోందని మంత్రి తెలిపారు. గ్రామీణ రహదారుల నిర్వహణ కోసం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌ను రాష్ట్రం అమలు చేస్తోందన్నారు.ఖఓఊ రాజ-4 కింద తెలంగాణలో ఇంకా అనేక ప్రాంతాలకు రోడ్డు అనుసంధానం అవసరమని, మార్కెట్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, అభివృద్ధి కేంద్రాలకు గ్రామీణ ప్రజలు సులభంగా చేరుకునేలా మరిన్ని పనులు మంజూరు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖను కోరారు.మంత్రి చేసిన విజ్ఞప్తులపై కేంద్ర ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించిన అంశాలు, అభిప్రాయాలు, అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సెక్రెటరీ అతిథి సింగ్ తెలిపారు. అటవీ, వన్యప్రాణి చట్టాల కారణంగా ఎదురవుతున్న సమస్యలపై కేంద్ర స్థాయిలో చర్చించి, పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక అనుమతుల మంజూరు అంశాన్ని కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు

# అల్లాడుతున్న ఉత్తర తెలంగాణ




**అదిలాబాద్, మే 22 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్రంలో భానుడు భగభగలాడుతున్నాడు. గత కొన్ని రోజులుగా పెరుగుతున్న ఎండల తీవ్రత ప్రస్తుతం పతాక స్థాయికి చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 డిగ్రీల వరకు అధికంగా నమోదు అవుతుండటంతో జనం ఇబ్బంది పడుతున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేస్తూ హెచ్చరికలు చేసింది. రాష్ట్రంలో మంగళవారం నాటి వాతావరణ గణాంకాలు భయం గొల్పుతున్నాయి. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల ఐలాపూర్‌లో 45.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎండల తీవ్రత చాలా ముందుగానే పెరిగింది. 2025 మే 19న రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత 41.9 డిగ్రీలు ఉండగా, ఈ ఏడాది అదే సమయానికి 45.9 డిగ్రీలకు చేరుకోవడం వాతావరణ మార్పుల తీవ్రతకు అద్దం పడుతోంది. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల వంటి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాలుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు మార్కును దాటేశాయి. హైదరాబాద్‌లో వేడి తీవ్రం 43 డిగ్రీలుగా నమోదు అయ్యింది. తీవ్రమైన ఎండల కారణంగా రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మంగళవారం వడ దెబ్బకు గురైన నలుగురు వ్యక్తులు మరణించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరుకు చెందిన రాచర్ల రాజు అనే రైతు మరణించాడు.

# జెన్ జీ కోసం పాపులేషన్ పాలసీ

**విజయవాడ, మే 22 (సూర్య సేన) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన పాపులేషన్ పాలసీ ఇప్పుడు దేశవ్యాప్త చర్చకు, విమర్శలకు కేంద్రబిందువుగా మారింది. జనాభా నియంత్రణ నుంచి జనాభా పెంపు వైపు ఆయన తీసుకున్న ఈ యూ-టర్న్ వెనుక బలమైన ఆర్థిక కారణాలు ఉన్నప్పటికీ, సామాజికంగా మాత్రం అది తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. రాజకీయంగా తక్షణ లాభం లేని, పైగా వివాదాస్పదమైన ఈ అంశాన్ని ఆయన పదే పదే ప్రస్తావిస్తూ విమర్శలకు గురవుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో జననాల రేటు ప్రమాదకరంగా పడిపోతోందని, ఇదే కొనసాగితే భవిష్యత్తులో పనిచేసే యువత కరువై, రాష్ట్రం వృద్ధాశ్రమంగా మారుతుందన్నది ఆయన ప్రధాన ఆందోళన. జపాన్, దక్షిణ కొరియా, చైనా వంటి దేశాలు ఇప్పుడు ఎదుర్కొంటున్న జనాభా సంక్షోభాన్ని ఉదాహరణగా చూపుతూ ఆయన మేల్కొలుపు పలుకుతున్నారు. అయితే, ఈ పిలుపునకు రాజకీయ వర్గాల నుంచి కంటే సామాజిక వర్గాల నుంచే గట్టి సెగ తగులుతోంది. చంద్రబాబు ప్రతిపాదించిన నగదు ప్రోత్సాహకాలు 3వ బిడ్డకు రూ.30 వేలు, 4వ బిడ్డకు రూ.40 వేలు ఫెమినిస్టులు , మహిళా సంఘాలు నిప్పులు చెరుగుతున్నాయి. కేవలం డబ్బు ఆశ చూపి మహిళల శరీరాలను జనాభా ఉత్పత్తి యంత్రాలు గా మార్చాలని చూడటం అప్రజాస్వామికమని వారు వాదిస్తున్నారు. పిల్లల్ని కనాలా వద్దా అన్నది దంపతుల వ్యక్తిగత నిర్ణయమని, అందులో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సరైనది కాదని మండిపడుతున్నారు. ముఖ్యంగా గర్భధారణ, ప్రసవం వల్ల మహిళల ఆరోగ్యంపై పడే ప్రభావాన్ని ఆర్థిక ప్రోత్సాహకాలతో తూచలేమని వారు స్పష్టం చేస్తున్నారు.నేటి తరం యువ దంపతులు పిల్లల విషయంలో చాలా భిన్నంగా ఆలోచిస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఆకాశాన్నంటుతున్న విద్యా, వైద్య ఖర్చుల దృష్ట్యా ఒకరిని పెంచడమే భారంగా భావిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.30 వేలు ఒక నెల పాలకు, డైపర్లకు కూడా సరిపోవు.. మరి ఆ బిడ్డ 20 ఏళ్లు పెరిగి పెద్దయ్యే వరకు అయ్యే లక్షల రూపాయల ఖర్చు ఎవరు భరిస్తారు అన్నది సామాన్యుల నుంచి వస్తున్న సూటి ప్రశ్న. ఈ ఆర్థిక వాస్తవాలను విస్మరించి కేవలం జనాభా సంతులనం కోసం పిల్లల్ని కనమనడం




క్షేత్రస్థాయిలో ట్రోలింగ్‌కు దారితీస్తోంది.రాజకీయ నాయకులు సాధారణంగా తక్షణ ఓట్లు రాల్చే పథకాల గురించి మాట్లాడతారు. కానీ చంద్రబాబు ప్రతిపాదించిన ఈ జనాభా విధానం వల్ల ఆయనకు వచ్చే తక్షణ రాజకీయ లాభం సున్నా. పైగా, ఇది తీవ్రమైన విమర్శలకు, ట్రోలింగ్‌కు దారితీస్తోంది. అయినప్పటికీ ఆయన వెనక్కి తగ్గడం లేదు. చంద్రబాబు వాదనను బలపరిచే వారు కూడా లేకపోలేదు. యువత లేని దేశం మనుగడ సాగించలేదు అన్నది ఆర్థిక నిపుణుల మాట. ఒకప్పుడు జనాభాను భారంగా చూసిన మనం, ఇప్పుడు డెమోగ్రాఫిక్ డివిడెండ్ గురించి మాట్లాడుకుంటున్నాం. చంద్రబాబు సూచనలు ఈరోజు వినడానికి వింతగా ఉన్నా, మరో రెండు దశాబ్దాల తర్వాత అప్పుడు పుట్టిన పిల్లలు లేకపోతే రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీస్తుందన్నది ఆయన సిద్ధాంతం. అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పుడు అనుభవిస్తున్న చేదు అనుభవాలే ఆయనకు ప్రేరణ.కేవలం పిల్లల్ని కనమని చెప్పడం కంటే, వారి పెంపకానికి అవసరమైన సామాజిక రక్షణ వ్యవస్థను ప్రభుత్వం నిర్మించాల్సిన అవసరం ఉంది. ఉచిత విద్య, మెరుగైన వైద్యం, తల్లులకు ఉద్యోగ భద్రత వంటి అంశాలపై హామీ ఇవ్వకుండా కేవలం నగదు ప్రోత్సాహకాలు ఇవ్వడం వల్ల ఫలితం ఉండదు. అలాగే, ప్రస్తుత యువతకు ఉన్న ఆర్థిక ఆందోళనలను ప్రభుత్వం గౌరవించాలి. రాజకీయంగా లాభం లేకపోయినా, వ్యక్తిగత ఇమేజ్ దెబ్బతింటున్నా చంద్రబాబు ఈ అంశాన్ని వదలడం లేదు. ఇప్పుడు వస్తున్న ట్రోల్స్ తాత్కాలికమే కావొచ్చు, కానీ ఆయన చెప్పిన జనాభా సంక్షోభం నిజమైతే మాత్రం భవిష్యత్తులో ఆయనను గొప్ప ముందుచూపున్న నాయకుడిగా చరిత్ర గుర్తిస్తుంది.

# మణుగూరు-రామగుండం రైల్వే లైన్



**కరీంనగర్, మే 22 (సూర్య సేన) :**రామగుండంలో రైలు ఎక్కి మేడారంలో మొక్కులు చెల్లించుకొని, ఆ తర్వాత భద్రాచలంలో రైలు దిగి రాముణ్ని దర్శించుకుంటే..? భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) స్టేషన్లో రైలు ఎక్కి విశాఖపట్నంలో దిగి బీచ్‌లో ఎంజాయ్ చేసి.. మళ్లీ భద్రాచలం రోడ్ మీదుగానే రామగుండం వెళ్లిపోతే..? ఊహ భలే ఉంది కదా. కొత్తగా ఏర్పాటు కానున్న రామగుండం-మణుగూరు రైల్వే లైన్‌తోపాటు.. ఇప్పటికే రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన భద్రాచలం రోడ్-కొవ్వూరు రైల్వే లైన్ ఏర్పాటయితే ఈ కల త్వరలోనే సాకారం కానుంది.తెలంగాణలో మరో కొత్త రైల్వే మార్గం అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, పారిశ్రామిక కేంద్రాలను కలుపుతూ కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కానుంది. మణుగూరు-రామగుండం కొత్త రైలు మార్గాన్ని ఐదేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.5818.45 కోట్లు ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును పబ్లిక్-ప్రయివేట్ భాగస్వామ్యంలో పూర్తి చేయనున్నారు. 207.8 కిలోమీటర్ల పొడవైన ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే.. మణుగూరు-రామగుండం మధ్య 90 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ప్రస్తుతం మణుగూరు నుంచి రామగుండం వెళ్లడానికి భద్రాచలం రోడ్, కాజీపేట మీదుగా చుట్టూ తిరుగుతూ ప్రయాణించాల్సి వస్తోంది.కొత్త రైల్వే అందుబాటులోకి వస్తే భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, పెద్దపల్లి జిల్లాల్లోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైలు సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. గిరిజనుల అతిపెద్ద జాతర జరిగే మేడారం ప్రాంతానికి రైలులో వెళ్లొచ్చు. మంథని, భూపాలపల్లి, మేడారం, తాడ్వాయి, గోపాలరావుపేట మీదుగా ఈ రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ రైలు మార్గం న్యూఢిల్లీ-చెన్నై మార్గంలోని విజయవాడ-నాగ్‌పూర్ సెక్షన్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది.ప్రజా రవాణాతోపాటు బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు, ఖనిజాల ఎగుమతులకు ఈ రైల్వే మార్గం కీలకం కానుంది. పెద్దపల్లి, ములుగు జిల్లా ప్రజలు మేడారం, భద్రాచలం లాంటి ఆధ్యాత్మిక పర్యాటక ప్రదేశాలకు తక్కువ ఖర్చుతో, సౌకర్యవంతంగా వెళ్లడానికి వీలవుతుంది.ఏడాదిలోగా భూసేకరణ చేపట్టాలని.. మరో నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. భూసేకరణ, అనుమతులు, డీపీఆర్ రూపకల్పన లాంటి పనులను రైల్వే శాఖ చూసుకుంటుంది. రైలు మార్గం నిర్మాణం, నిధుల సమీకరణతోపాటు 45 ఏళ్లపాటు ఈ రైలు మార్గ నిర్వహణ బాధ్యతను ప్రయివేట్ సంస్థకు అప్పగిస్తారు. రైల్వే శాఖ పీపీపీ మోడల్‌కు సంబంధించి ప్రతిపాదనలను రూపొందించిన తర్వాత టెండర్లను ప్రారంభిస్తారు.
ఈ కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే.. మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. భద్రాచలం నుంచి రామగుండం చేరుకోవడం సులభం అవుతుంది. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం-పాండురంగాపురం వరకు 186 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్‌కు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ లైన్‌కు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తయ్యింది. అలాగే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), డోర్నకల్ స్టేషన్ల మధ్య డబుల్ లైన్ పనులు జరుగుతున్నాయి. దీంతోపాటు భద్రాచలం రోడ్ నుంచి ఆంధ్రాలోని కొవ్వూరు వరకు రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే తెలంగాణలోని సత్తుపల్లి వరకు 56 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ ఏర్పాటు చేశారు. ఈ మార్గాన్ని బొగ్గు రవాణా కోసం ఉపయోగిస్తున్నారు. సత్తుపల్లి నుంచి కొవ్వూరు రైల్వే లైన్ కోసం డీపీఆర్ సిద్ధమైంది. భద్రాచలం రోడ్-కొవ్వూరు లైన్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్, విశాఖపట్నం నగరాల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.మరో 5-10 ఏళ్లలో ఈ మూడు రైల్వే మార్గాలు పూర్తయితే.. భద్రాచలం రోడ్ మీదుగా విశాఖ నుంచి రామగుండం, హైదరాబాద్ లాంటి నగరాలకు రైళ్లను నడపొచ్చు. గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర జిల్లాలకు.. ఉత్తర తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాలకు, ఒడిశాలోని గిరిజన ప్రాంతాలకు భద్రాద్రి జిల్లాలోని రైల్వే స్టేషన్లు జంక్షన్‌లా మారతాయి.రామగుండం రైల్వే స్టేషన్‌కు ఉత్తర భారతదేశంలోని న్యూఢిల్లీ, ఆగ్రా, లక్నో, వారణాసి, గ్వాలియర్, నాగ్‌పూర్, ముంబై లాంటి కీలక నగరాలతోపాటు.. సౌతిండియాలోని చెన్నై, బెంగళూరు, తిరువనంతపురం లాంటి కీలక నగరాలతో రైల్వే పరంగా అనుసంధానం ఉంది. ఈ కొత్త రైల్వే మార్గం అందుబాటులోకి వస్తే రామగుండం నుంచి విశాఖపట్నం, రాజమండ్రి లాంటి నగరాలకు దూరం తగ్గడంతోపాటు కనెక్టివిటీ మెరుగవుతుంది.

# ఏపీలో పొదుపు చర్యలు షురూ.....

**విజయవాడ, మే 22 (సూర్య సేన) :** పశ్చిమాసియా సంక్షోభం కారణంగా విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా స్పందించింది. . ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు ప్రతి ఒక్కరూ తమ కాన్వాయ్‌లను తగ్గించుకుని దేశ ఆర్థిక భద్రతే పరమావధిగా అడుగులు వేస్తున్నారు. నేడు జరిగిన కేబినెట్ సమావేశం ఇందుకు వేదికగా నిలిచింది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అధికారిక కాన్వాయ్‌ను 50 శాతం మేర కుదించుకున్నారు. గతంలో సుమారు 10కి పైగా వాహనాలతో వెళ్లే ముఖ్యమంత్రి, నేడు కేవలం 4 వాహనాలతోనే సచివాలయానికి చేరుకున్నారు. తన భద్రతా సిబ్బంది ఇబ్బంది పడకుండా ఉండటానికి, వారి కోసం ప్రత్యేకంగా ఒక బస్సును ఏర్పాటు చేళారుఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా తన కాన్వాయ్‌ను 4 వాహనాలకు పరిమితం చేసుకోవాలని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. జెడ్ కేటగిరీ భద్రత ఉన్నప్పటికీ, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది.



# అరబిందో ఫార్మా లాభం రూ.921 కోట్లు

అరబిందో ఫార్మా.. గడిచిన ఆర్థిక సంవత్సరం (2025-26) మార్చి తో ముగిసిన త్రైమాసికానికి గాను రూ.921 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని...

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా.. గడిచిన ఆర్థిక సంవత్సరం (2025-26) మార్చి తో ముగిసిన త్రైమాసికానికి గాను రూ.921 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం స్వల్పంగా 2 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా 5.6 శాతం వృద్ధితో రూ.8,382 కోట్ల నుంచి రూ.8,853 కోట్లకు చేరుకుంది. మార్చి త్రైమాసికంలో అమెరికా ఆదాయం 13 శాతం క్షీణించి రూ.3,543 కోట్లుగా నమోదు కాగా యూరప్ మార్కెట్ల నుంచి ఆదాయం ఏకంగా 30.2 శాతం వృద్ధితో రూ.2,147 కోట్ల నుంచి రూ.2,795 కోట్లకు పెరిగిందని అరబిందో ఫార్మా వెల్లడించింది. ఇదే సమయంలో వర్ధమాన మార్కెట్ల ఆదాయం కూడా రూ.786 కోట్ల నుంచి రూ.980 కోట్లకు పెరిగిందని తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కోసం రూ.400 కోట్లు వెచ్చించినట్లు కంపెనీ పేర్కొంది.

అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం స్వల్పంగా 2 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా 5.6 శాతం వృద్ధితో రూ.8,382 కోట్ల నుంచి రూ.8,853 కోట్లకు చేరుకుంది. అలాగే అమెరికా ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) నుంచి 9 అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్స్ (అండా)కు తుది ఆమోదం లభించిందని వెల్లడించింది. కాగా మార్చితో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.33,653 కోట్ల ఆదాయంపై రూ.3,503 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

## మార్కెట్లో 'మెలోడీ' మాయ...




**ముంబై :** స్టాక్ మార్కెట్లో వెర్రి వెంగళప్పలు పెరిగిపోతున్నారు. బుధ, గురువారాల్లో పార్లే ఇండస్ట్రీస్ షేర్లలో చోటు చేసుకున్న ర్యాలీనే ఇందుకు ఉదాహరణ. ప్రధాని మోదీ తన ఇటలీ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనీకి 'మెలోడీ' చాక్లెట్ల ప్యాక్‌ను బహుమతిగా ఇచ్చారు. దీంతో అనేక మంది ఇన్వెస్టర్లు రియల్టీ,ఇన్‌ఫ్రా రంగాల్లో కార్యకలాపాలు సాగించే పార్లే ఇండస్ట్రీస్ కంపెనీనే ఈ చాక్లెట్లను తయారు చేస్తోందనే వార్తలతో ఆ కంపెనీ షేర్లను వేలంవెర్రిగా కొనేశారు. దీంతో ఫేస్‌వాల్యూ రూ.10 కంటే తక్కువ ధరలో ట్రేడవుతున్న పార్లే ఇండస్ట్రీస్ షేర్లు గురువారం బీఎ?సఈలో ఏకంగా 5 శాతం అప్పర్ సర్క్యూట్ బ్రేకర్‌ను తాకి 4.95 శాతం లాభంతో రూ.5.51 వద్ద ముగిశాయి. నిజానికి ఈ మెలోడీ చాక్లెట్లను పార్లే ఆగ్రో ప్రొడక్ట్స్ అనే ఒక అన్‌లిస్టెడ్ కంపెనీ తయారు చేస్తోంది. ఈ కంపెనీ పోర్టుఫోలియోలో మెలోడీ చాక్లెట్లతో పాటు పార్లే-జీ, మొనాకో, క్రాక్‌జాక్, హైడ్ అండ్ సీక్, కచ్చా మ్యాంగో బైట్ సహా మరికొన్ని ఉత్పత్తులు ఉన్నాయి.

రిటైల్ మదుపరులు ఈ విషయం తెలుసుకోకుండా పార్లే ఇండస్ట్రీస్ ఈ చాక్లెట్ల తయారీదారు అనే వార్తలతో సదరు కంపెనీ షేర్ల కోసం ఎగబడ్డారు. దీంతో బీఎ?సఈలో గురువారం ఒక్కరోజే ఈ కౌంటర్లో దాదాపు 6.48 లక్షల షేర్లు ట్రేడయ్యాయి. మొత్తం మీద పెన్నీ స్టాక్‌గా మారుతున్న పార్లే ఇండస్ట్రీస్ షేర్లలో ఇరుక్కుపోయిన అనేక మంది రిటైల్ ఇన్వెస్టర్లకు వాటిని వదిలించుకునేందుకు చక్కటి అవకాశం ఏర్పడింది. ఎగబడి పార్లే ఇండస్ట్రీస్ షేర్లు కొన్న మదుపరులు మాత్రం వెర్రి వెంగళప్పలుగా మిగిలారు.

## హైబ్రిడ్ ఎంఎఫ్‌ల్లోకి పెట్టుబడుల వెల్లువ




న్యూఢిల్లీ: హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకాల్లోకి పెట్టుబడులు వెల్లువెత్తాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాలు రూ.1.55 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. క్రితం ఆర్థిక సంవత్సరం (రూ.1.2 లక్షల కోట్లు)తో పోల్చితే 29్ణ పెరుగుదల నమోదైంది. మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో వైవిధ్యభరితమైన పెట్టుబడి వ్యూహాలవైపు ఇన్వెస్టర్లు మొగ్గుచూపడంతో హైబ్రిడ్ ఎంఎఫ్ పథకాల్లోకి పెట్టుబడుల ప్రవాహం పెరిగింది. పశ్చిమాసియాలో యుద్ధంతో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ మార్కెట్ ఒడుదొడుకుల నుంచి రక్షణనిచ్చే సమతుల్య పెట్టుబడి పరిష్కారాల కోసం పెట్టుబడిదారులు వీటిని ఎంచుకున్నారు. మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో ఇన్వెస్టర్ల నుంచి హైబ్రిడ్ ఫండ్స్ మంచి ఆదరణను పొందాయని ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ ఎండీ, సీఈవో రాధికా గుప్తా తెలిపారు. వివిధ మార్కెట్ పరిస్థితులలో స్థిరమైన పనితీరును కనబరిచే సామర్థ్యం ఉన్నందున ముఖ్యంగా 'మల్టీ అసెట్ అలొకే షన్ ఫండ్స్' బాగా ప్రాచుర్యం పొందినట్టు చెప్పారు. తక్కువ రిస్క్‌తో ఈక్విటీలలో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి హైబ్రిడ్ ఫండ్స్ ప్రధాన ఎంపికగా మారుతున్నాయని గుప్తా పేర్కొన్నారు. 2024-25 నాటికి హైబ్రిడ్ పథకాల నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) రూ.8.83 లక్షల కోట్లు ఉండగా.. 2025-26 నాటికి రూ.10.35 లక్షల కోట్లకు పెరిగాయి.

## ఎల్ఐసీ లాభంలో 23 శాతం వృద్ధి...

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద ప్రభుత్వరంగ బీమా సంస్థ అయిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) 2025-26 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి (క్యూ4) రూ.23,420 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన నికర లాభం (రూ.19,013 కోట్లు)కన్నా ఇది 23 శాతం అధికం. సమీక్షా త్రైమాసికం లో ఎల్ఐసీ మొత్తం ఆదాయం రూ.2,22,805 కోట్ల నుంచి రూ.2,53,592 కోట్లకు పెరిగింది. ఈ ఏడాది మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఎల్ఐసీ రూ.57,419 కోట్ల లాభాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆర్జించిన నికర లాభం (రూ.48,151 కోట్లు) తో పోల్చితే వృద్ధి 19 శాతంగా ఉంది. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరు కు రూ.10 తుది డివిడెండ్‌ను బీమా సంస్థ బోర్డు సిఫారసు చేసింది. మరోవైపు వాటా దారులకు 1:1 నిష్పత్తిలో ఇంతకు ముందు బోనస్ షేర్లను ప్రకటించగా దీనికి రికార్డు తేదీగా మే 29ని నిర్ణయించారు.


## నేడు గుట్టకు సీఎం రేవంత్ రెడ్డి రాక



**- సుమారు రూ. 100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**హైదరాబాద్ / యాదగిరిగుట్ట, మే 22 (సూర్య సేన) :** నేడు (శనివారం) యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ రెడ్డి సుమారు రూ. 100 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9:37 గంటలకు టెంపుల్ సిటీ నందు వేద పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం బాలాలయం స్థలంలో కళ్యాణ మండప నిర్మాణం, దీక్షాపరులకు సదనం, వైకుంఠ ద్వారం మెట్ల ద్వారం నుంచి కొండపైకి వరకు పైకప్పు నిర్మాణం, వాయువ్య దిశలో మెట్ల మార్గం నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తారు.


## 2026-27లో రూ.350 కోట్ల ఆదాయ లక్ష్యం




ప్యారడైజ్ పేరుతో బిర్యానీ రెస్టారెంట్స్‌ను నిర్వహిస్తున్న ప్యారడైజ్ ఫుడ్ కోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, సమారా క్యాపిటల్.. దేశవ్యాప్తంగా కార్యకలాపాలు...

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్యారడైజ్ పేరుతో బిర్యానీ రెస్టారెంట్స్‌ను నిర్వహిస్తున్న ప్యారడైజ్ ఫుడ్ కోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, సమారా క్యాపిటల్.. దేశవ్యాప్తంగా కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. విస్తరణలో భాగంగా వచ్చే మూడేళ్లలో కొత్తగా రూ.100 కోట్ల పెట్టుబడితో 100 రెస్టారెంట్లను ప్రారంభించాలని నిర్ణయించినట్లు ప్యారడైజ్ ఫుడ్‌కోర్ట్ ఎండీ, సీఈఓ అభిక్ మిత్రా, సమరా క్యాపిటల్ ఎండీ నీలాయ్ ప్రతీక్ తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీ, బెంగళూరు, చెన్నైల్లో మొత్తం 57 ప్యారడైజ్ రెస్టారెంట్లను నిర్వహిస్తున్నట్లు మిత్రా వెల్లడించారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా తొలి దశలో వచ్చే ఏడాది, ఏడాదిన్నర కాలంలో 50-60 రెస్టారెంట్లను హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల్లో ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. రెండో దశలో ముంబై, పుణె, ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో రెస్టారెంట్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా గడచిన ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్యారడైజ్ ఫుడ్‌కోర్ట్ ఆదాయం 20 శాతం వృద్ధి చెంది రూ.265 కోట్లకు చేరుకుందన్నారు. కార్యకలాపాల విస్తరణతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో రూ.350 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు.

## ఎస్‌బీఐ ఉద్యోగుల సమ్మె హెచ్చరిక...




తమ డిమాండ్లకు ఒప్పుకోకపోతే వచ్చే సోమవారం నుంచి రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె తప్పదని...

న్యూఢిల్లీ: తమ డిమాండ్లకు ఒప్పుకోకపోతే వచ్చే సోమవారం నుంచి రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె తప్పదని ఎస్‌బీఐ ఉద్యోగుల సంఘం ప్రకటించింది. మెసెంజర్లు, ఆర్మ్‌డ్ గార్డుల నియామకంతో పాటు ఎన్‌పీఎ?సలో పెన్షన్ ఫండ్ మేనేజర్‌ను మార్చుకునే ఆప్షన్ కావాలని ఎస్‌బీఐ ఉద్యోగులు ఎప్పటి నుంచో కోరుతున్నారు.

అలాగే పర్మినెంట్ ఉద్యోగులు చేయాల్సిన కొన్ని కీలక బాధ్యతలను ఔట్‌సోర్సింగ్‌కు అప్పగించడాన్నీ, బ్యాంకు బోర్డులో ఉద్యోగుల ప్రతినిధి నియామకంపై మేనేజ్‌మెంట్ జాప్యం చేయడాన్ని వారు తప్పుపడుతున్నారు. మేనేజ్‌మెంట్ ఈ డిమాండ్లపై దిగిరాకపోతే సోమవారం నుంచి రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె తప్పదని అఖిల భారత ఎస్‌బీఐ ఉద్యోగుల సమాఖ్య గురువారం హెచ్చరించింది. ఈ సమ్మె ప్రారంభమైతే ఈ శనివారం నుంచి ఐదు రోజుల పాటు దేశవ్యాప్తంగా ఎస్‌బీఐ కార్యకలాపాలు నిలిచిపోతాయి. బ్యాంకింగ్ ఉద్యోగులకు ప్రతి నెల రెండు, నాలుగో శనివారాలు సెలవు. వచ్చే బుధవారం బక్రీద్ సందర్భంగా అనేక రాష్ట్రాల్లో సెలవు ప్రకటించారు. దీంతో ఈ శనివారం నుంచి వచ్చే బుధవారం వరకు ఎస్‌బీఐ శాఖలు మూతపడే సూచనలు కనిపిస్తున్నాయి.



## వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త

# రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ



మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టు కోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కుచాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈచిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# 70లోనూ యంగ్ హీరోలకు పోటీ.. చిరంజీవి న్యూ లుక్



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి వయసు పెరుగుతున్న కొద్దీ మరింత యంగ్‌గా కనిపిస్తూ అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. 70 ఏళ్ల వయసులోనూ అదే ఎనర్జీ, అదే గ్లామర్‌తో కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు చిరు. ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన ఆయన సినిమా భారీ విజయాన్ని అందుకుని బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపింది. దాదాపు రూ.400 కోట్ల వసూళ్లతో మెగాస్టార్ మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకున్నారు. ప్రస్తుతం దర్శకుడు కేఎస్ రవీంద్ర దర్శకత్వంలో చిర నటిస్తుండగా, ఈ సినిమా కోసం చిరంజీవి పూర్తిగా కొత్త మేకోవర్‌లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫోటోలు దీనికి నిదర్శనంగా మారాయి. లేత తెలుపు రంగు పోలో షర్ట్‌లో చిరంజీవి ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. స్లిమ్ ఫిట్ లుక్, యంగ్ స్టైల్‌తో ఆయన తన వయసులో సగం ఉన్నట్లుగా కనిపిస్తూ అభిమానులను ఫిదా చేస్తున్నారు. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు "చిరంజీవి వయసు రివర్స్‌లో వెళ్తుందా?" అంటూ కామెంట్లు పెడుతున్నారు. చిరంజీవి ఫిట్‌నెస్ వెనుక ఉన్న క్రమశిక్షణ కూడా ప్రత్యేకమే. ఆయన దృష్టిలో ఫిట్‌నెస్ అంటే కేవలం శారీరక దృఢత్వం మాత్రమే కాదు, మానసిక ప్రశాంతత కూడా అంతే ముఖ్యమని భావిస్తారు. అందుకే ఎప్పుడూ స్ట్రెస్ ఫ్రీగా, ప్రశాంతంగా కనిపిస్తుంటారు. ఆహారపు అలవాట్ల విషయంలో కూడా ఎంతో జాగ్రత్తగా ఉంటారు. ఎక్కువగా వెజిటేరియన్ హై ప్రోటీన్ ఫుడ్, సలాడ్స్, సూప్స్ తీసుకుంటారని సమాచారం. షూటింగ్ ఎక్కడ ఉన్నా ఇంటి నుంచే భోజనం తెప్పించుకోవడం ఆయన అలవాటు. అలాగే ప్రతిరోజూ వర్కవుట్స్, యోగా, ప్రాణాయామం తప్పకుండా చేస్తుంటారు. ఉదయం 4 గంటలకే లేచి రెండు గంటల పాటు వ్యాయామం చేసిన తర్వాతే ఇతర పనుల్లో పాల్గొంటారని సినీ వర్గాలు చెబుతున్నాయి. పాత్రకు తగ్గట్లుగా తనను తాను మార్చుకోవడంలో

చిరంజీవి ఎప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపుతుంటారు. ఇక బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ సినిమాకు 'కాకా' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అలాగే మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ కీలక పాత్రలో కనిపించే అవకాశమున్నట్లు ఫిలింనగర్‌లో టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం చిరంజీవి న్యూ లుక్ ఫోటోలు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండగా, అభిమానులు మెగాస్టార్ స్టైల్, ఫిట్‌నెస్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు.

# కార్తీ సినిమాకు మరో తెలుగు దర్శకుడు



కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ, టాలీవుడ్ యంగ్ డైరెక్టర్ కళ్యాణ్ శంకర్‌తో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రంలో కార్తీకి జోడీగా మీనాక్షి చౌదరి నటిస్తోం ది. ప్రస్తుతం హైదరాబాద్‌లో సినిమా షూటింగ్ కొనసాగుతోంది. కాగా ఈ చిత్రానికి మరో దర్శకుడు పనిచేయబో తున్నాడన్న వార్త ఒకటి నెట్టింట చక్కర్లు కొడుతోంది. మిరాయి, ఈగల్ సినిమాలను డైరెక్ట్ చేసిన కార్తీక్ ఘట్టమనేని ఈ మూవీకి సినిమాటోగ్రఫీ చేయబో తున్నాడు. దీంతో కార్తీక్ ఘట్టమనేని ఇక సినిమాటోగ్రఫర్ కమ్ డైరెక్టర్‌గా మారిపోయాడన్నమాట. టాలీవుడ్‌లో 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్'చిత్రాలతో సూపర్ హిట్స్‌అందుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్ కార్తీతో కమర్షియల్ ఎంటర్‌టైనర్ తెరకెక్కిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీపై అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. కార్తీకి తెలుగులో ఉన్న క్రేజ్, కళ్యాణ్ శంకర్ మార్క్ హ్యూమర్ టచ్‌తో రాబోతున్నఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# కమల్–రజనీ మూవీలో త్రిష



తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.

# భస్మ హారతిలో పాల్గొన్న తమన్నా



స్టార్ హీరోయిన్స్ ఎంత గ్లామర్ రంగంలో ఉన్నా కూడా భక్తిమార్గాన్ని వదలరు. తమ పనుల్లో బిజీగా ఉన్నా కూడా ఖాళీ చేసుకొని మరీ దైవదర్శనాలు చేస్తూ ఉంటారు. తాజాగా అందాల మిల్కీ బ్యూటీ తమన్నా సైతం ఆధ్యాత్మికత వైపు మొగ్గుచూపుతోంది. తనదైన ఎనర్జీ తో యూత్‌నుఆకట్టుకుంటున్న స్టార్‌హీరోయిన్, భక్తిమార్గంలో అడుగు లు వేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తాజాగా తమన్నా ఉజ్జయిని మహాకాళేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రానికి వచ్చి స్వామివారిని దర్శించుకుం ది. తెల్లవారుజామున జరిగే అతి పవిత్రమైన భస్మహారతిలో ప్రత్యక్షం గా పాల్గొని,మహాకాలుడికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. సంప్రదా యబద్ధమైన ఎరుపు చీరలో ఆలయనియమాలన్నీ కఠినంగా పాటిస్తూ, భక్తితో మహాకాలుడిని దర్శించుకుంది. తమన్నాను అక్కడ చూసినవా రంతా ఆశ్చర్యపో యారు. నిర్మాత ప్రజ్ఞా కపూర్‌తో కలిసి తమన్నా ఆలయానికి వచ్చింది. శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు.. ఆయన పిలుపు అందినప్పుడే మనం ఈ క్షేత్రానికి వస్తాము. స్వామివారి దర్శనం తనకు ఎంతో ప్రశాంతతను, ఆధ్యాత్మిక శక్తిని ఇచ్చింది అని చెప్పుకొచ్చింది. ఈ సందర్భంగా తీసిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్లామర్ క్వీన్‌కి భక్తి కూడా ఎక్కువే అంటూ నెటిజన్లు, ఫ్యాన్స్ ప్రశంసలతో ముంచేస్తున్నారు. ఇక ఆలయం విషయానికి వస్తే...ఉజ్జయిని మహాకాల్ ఆలయంలో ప్రతి రోజు తెల్లవారుజామున జరిగే ఈ భస్మ హారతి హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన క్రతువు. పవిత్ర భస్మతో శివలింగాన్ని అభిషేకం చేయడం ద్వారా జననం, మరణం, పునర్జన్మ అనే కాలచక్రాన్ని సూచిస్తారు.

## చిరంజీవి సినిమాల్లో రెండు సార్లు ఆఫర్లు వచ్చినా వదులుకున్నా: ఇంద్రజ

90వ దశకంలో స్టార్ హీరోయిన్‌గా వెలిగిన ఇంద్రజకు మెగాస్టార్ చిరంజీవి పక్కన నటించాలనే కోరిక బలంగా ఉండేదట. ఆమె కోరుకున్నట్టుగానే చిరంజీవితో నటించే అవకాశం ఆమెకు రెండు సార్లు వచ్చింది. అయితే, చిరంజీవి పక్కన ఛాన్స్ వచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. మొదటిసారి ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'అల్లుడా మజాకా' సినిమాలో చిరంజీవి చెల్లెలి పాత్ర కోసం ఆమెను సంప్రదించారు. కానీ, చిరంజీవి పక్కన హీరోయిన్‌గా నటించాలని లేదా కనీసం ఆయనతో కలిసి ఒక మాస్ సాంగ్‌లో స్టెప్పులు వేయాలని ఆశించిన ఇంద్రజ, చెల్లెలి పాత్ర కావడంతో ఆ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించింది.

ఆ తర్వాత ఎడిటర్ మోహన్ దర్శకత్వంలో రూపొందిన 'హిట్లర్' సినిమాలో రాజేంద్ర ప్రసాద్ సరసన నటించే అవకాశం వచ్చింది. అయితే అప్పటికే మరో సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటం వల్ల డేట్స్ కుదరక ఆ ఛాన్స్‌ను కూడా వదులుకోవాల్సి వచ్చింది. ఇలా రెండు గొప్ప అవకాశాలు చేజారినందుకు ఇప్పటికీ చిన్న అసంతృప్తి ఉందని ఆమె చెప్పుకొచ్చింది.








EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com